# అహంకారపు అంతిమక్షణాలు

నవల

- గొల్లపూడి మారుతిరావు





శ్రీ
కౌముది
మీ మునివేళ్ళలో సాహితీ వెన్నెల
www.koumudi.net
ప్రచురణ సంఖ్య: 132

# (ప్రారంభం)

**వామనరావుని అలా చూస్తానని** ఎన్నడూ ఊహించనయినా ఊహించలేదు. అన్నిటికన్నా ఆశ్చర్యపరిచిన విషయం అతని చిరునవ్వు, కళ్ళల్లో ఇంకా బ్రతకాలన్న కోరిక.

పదేళ్ళు అతనితో కలిసి తిరిగినా, నాకు అతన్ని చూసినప్పుడల్లా అనిపించేది - ఈరెంటికీ అతను జీవితంలో నోచుకోలేదేమోనని.

వామనరావు నవ్వేవాడు - దశాబ్దం కిందటే చచ్చిపోయి, ఆశలన్నింటినీ కష్టాల వత్తిడిలో మరిచిపోయి, జీవితంలో ఇంతకన్నా కష్టం ఏం వస్తుందిలే అనే నైరాశ్యంలో నవ్వేవాడు. కళ్ళల్లో ఇంకా బ్రతకాలనికాక, ఇంకేం బ్రతుకుతాం అన్న నిర్వేదం కనిపించేది. అలాంటి వామనరావు ఆ కష్టాల నైరాశ్యపు చిరునవ్వును జయించి, కళ్ళలో వెలుగు తెచ్చుకుని, పలకరిస్తున్న క్షణంలో కాలచక్రం ఒక్కసారి నిలిచిపోయినట్టనిపించింది నాకు.

వామనరావు నవ్వితే, జీవితం మీద అంత ఆశను ప్రకటిస్తే ఇక ఈ ప్రపంచంలో ఏది అసాధ్యమా అనిపిస్తుంది.

ఇక మార్పుకి అతన్ని కారణం అడిగితే - దానికి చెప్పిన సమాధానం నా గుండెను పగులగొట్టింది. నిర్ఘాంతపోయాను, తెల్లబోయాను.

"నిజమా - వామనరావ్!?" అన్నాను.

నిజమేనంటున్నాయి అతని కళ్ళు నేనింకా ఏదో అడిగేలోపున రైలు కదిలిపోయింది.

ఆ పెదాలమీద చిరునవ్వు, కళ్ళల్లో ఆశ్చర్యం అతని మంచి బ్రతుక్కి సాక్ష్యంగా గుర్తుండిపోయాయి.

అప్పుడే మూడేళ్ళయిపోయింది అతన్ని చూసి.

కథ చెప్పడమంత కష్టమయిన పని మరొకటి లేదు. ప్రపంచంలో లేనిదాన్ని సృష్టించడమంత తేలికయిన పని మరొకటి లేదు. కానీ ఉన్నదాన్ని నిజాయితీతో ఉన్నట్టు చెప్పడం చాలా కష్టమయిన పని. అతనిప్పటికీ ఎక్కడో, ఏమూలో బ్రతికి ఉన్నాడు. ఎప్పుడో ఒకప్పుడు ఈ పుస్తకం అతని చేతుల్లో పడుతుంది. ఈ కథకు బలమైన సాక్ష్యం అతనేనన్న విషయం గుర్తుకొచ్చినప్పుడల్లా నా బాధ్యత చటుక్కున గుర్తుకొస్తుంది.

కథకు కాళ్ళూ చేతులూ ఉండవంటారు మరి. కాని ఈ కథకి అవి రెండూ అమర్చడానికి శతధాల ప్రయత్నించాను. వాస్తవానికి ఊహని జోడించడం ఎంత విచిత్రంగా ఉంటుందో వినాయకుడి విగ్రహం, విన్సెంట్ వాంగో చిత్రాలూ సాక్ష్యం చెప్తాయి ఈ కథలో కాళ్ళూ చేతులూ నావి. శరీరం, హృదయం అంతా ఇంకా ఇప్పుడూ, ఎక్కడో ఎలాగో బ్రతికి ఉన్న మా వామనరావువి.

పదేళ్ళ కిందట వామనరావంటే అర్థం - పుట్టెడు మంచితనం, గుండె చాలనంత ఆవేశం, నిరాశ, కోరికలూ, ఆశయాలతో నిలిచిపోయిన మెత్తటి చిరునవ్వు.

సన్నగా, పీలగా, ఒంటరిగా - జీవితం మీద తిరుగుబాటు చేసే విప్లవవాదిలాగ కనిపించేవాడు వామనరావు. ఎవరయినా పలకరిస్తే మాట్లాడేవాడు; లేకపోతే లేదు.

ఎక్కడో ఆలోచనల్లో నిద్రపోయి, నవ్వు మధ్య కళ్ళు విప్పేవాడు. విడదీయలేని ప్రతి ప్రశ్నకి అతి చక్కని సమాధానం అతని చిరునవ్వు. మనస్సుని ఉక్కిరిబిక్కిరి చేసే ప్రతి కష్టానికీ సముదాయింపు చిరునవ్వు. అంత పదునుగా, తియ్యగా, అందంగా - ఆయుధాన్ని చేసుకున్నాడు ఆ చిరునవ్వుని.

మా యూనివర్శిటీ బస్సులో ఓ మూల - ఎదురుగ్గా రోడ్డంతా కనిపించేచోట కూచునేవాడు. ఎప్పుడూ పోస్టాఫీసు దగ్గరే ఎక్కి, యూనివర్శిటీ విక్రమదేవవర్మ విగ్రహం ముందు దిగేవాడు. పొరపాటున డ్రైవరు అక్కడ బస్సు ఆపడం మరిచిపోతే, అతనూ దిగడం మరచిపోయేవాడు. దిగమని డ్రైవరు గుర్తుచేస్తే నవ్వేవాడు.

బస్సులో అంతా రెండు రోజుల్లో స్నేహితులు అయిపోవడం కద్దు. కానీ నా రెండేళ్ళ ప్రయాణంలోనూ అతను ఎవరితోనూ మాట్లాడగా చూడనేలేదు నేను. ఎట్లా అయిందో నాతో పరిచయం మాత్రం అయింది. ఆ ఊరిలో, ఆ యూనివర్శిటీలో, బహుశా అతని జీవితంలో - ఇంత స్నేహాన్ని ఎవరితో కలుపుకుని ఉండడు.

"మనపట్ల సానుభూతి చూపడానికన్నా పదిమంది స్నేహితులుండడం మంచిదికదా వామనరావ్!" అంటే;

నవ్వి - "మంచిదే కానీ ఎదుటివారికి నచ్చేటట్టు మాట్లాడడం నాకు చేతకాదు. నా బాధల్తో వాళ్ళని ఎందుకు ఏడిపించడం" - అన్నాడు ఓసారి.

బస్సు ఎక్కిన దగ్గరనుంచీ రోడ్డుమీద వచ్చేపోయే జనాన్ని గమనిస్తూంటాడు. బస్సు అట్లా జనాన్ని కత్తిరించుకుపోతూంటే, జీవితంలో కష్టాలను తప్పించుకుపోయే ఒంటరితనం గుర్తుకొస్తుంది కాబోలు -

ఎవరిలోనూ ఆసక్తిరేపని ఆ వ్యక్తి ఎవరికీ జ్ఞాపకం ఉండేవాడు కాదు .అందరూ మరచిపోయారు కానీ బస్సులో ఆ మూల ఎప్పుడూ ఖాళీ ఉండేదికాదు. ఎప్పుడూ అతనే అక్కడ కనిపించేవాడు. ఒక సంవత్సరం పాటు నేనూ అతన్ని గమనించలేదు.

ఉన్నట్టుండి హఠాత్తుగా అతను రావడం మానేశాడు. బస్సులో ఆ మూల ఖాళీ అయింది. మొదట్లో ఎవరూ అటువేపు జరగలేదు. ఓ ప్రఖ్యాత వ్యక్తికి గౌరవార్థం సమర్పించే శ్రద్ధాంజలిలాగ ఆ స్థలం మాత్రం ఆ వ్యక్తి గౌరవార్థం వదిలేసేవారు. కానీ నెలరోజులు గడిచిపోయాక అంతా సర్దుకుపోయారు. అందరూ కనిపించని ఆ వ్యక్తిని గురించి ఆలోచించారు. యూనివర్శిటీలో అతనేం చేస్తున్నాడా తర్జన భర్జనలు చేశారు. ఎందుకు రాలేదా అని ఆశ్చర్యపోయారు. ఏవో చెప్పుకున్నారు. క్రమంగా ఆ ఖాళీ భర్తీ అయిపోయింది. ఆ బస్సులో ఎవరూ గుర్తించని ఒక వ్యక్తి ప్రయాణం చేసేవాడన్న జ్ఞాపకం పూడుకుపోయింది. మళ్ళీ ఎవరూ అతని గురించి ఆలోచించలేదు.

నెలరోజుల తరువాత ఒకనాటి ఉదయం బీచ్‌లో నడుచుకు పోతూ ఉంటే అప్పుడే విడుతున్న ఆకాశపు వెలుగుని చూస్తూ, చల్లటి ఇసుకలో వెల్లకిలా పడుకుని కనిపించాడు అతను - వామనరావు.

ఆసక్తి తీరక దగ్గరికి పోయి చూస్తే - సందేహం లేదు - అతనే. ఎందుకో కొండంత సంతోషం కలిగింది, అతన్ని చూడగానే, పోయిన రూపాయి దొరికినట్టు.

పది సంవత్సరాల క్రితం బస్సులో పరిచయం ఉన్న వ్యక్తి - స్విట్జర్లాండులో హఠాత్తుగా తారసపడి తెలుగులో పలకరిస్తే ఎలా ఉంటుంది? - అంత ఆశ్చర్యపోయాడు వామనరావు నన్ను చూడగానే.

"బస్సుకి రావడం లేదే?" అని అడిగాను.

ఎంతోసేపటికి గుర్తుపట్టి ఉంటాడు. బహుశా ప్రశ్నకు సమాధానంగా నవ్వాడు. అదే నాకు తెలిసిన మొదటినవ్వు. అతనితో స్నేహం చేసుకోవాలని, అతనిలో ఏదో ప్రత్యేకత ఉన్నదనీ ఆ క్షణాన ఆ నవ్వు చూశాకనే అనుకున్నాను.

"చదువు మానేశాను" అన్నాడు నెమ్మదిగా.

తూర్పు ఆకాశం ముఖం ఎర్రబడింది. రెండు పల్చటి మేఘాల గుండె బ్రద్దలయి చిక్కటి రక్తం సముద్రపు అంచువరకూ జారింది.

"ఏం?" అన్నాను.

పదిరకాల జవాబులు మనస్సులో కూడపలుక్కుని ఉంటాడనుకుంటాను. ఎంతో తికమక అర్థమయింది. ఆ సరికే పక్కన చదికిలబడ్డాను

"ఎందుకు చదువు మానేస్తాను - చేతకాక."

"డబ్బా?"

"పది కుటుంబాలు బ్రతకగలిగినంత ఉంది."

"మరింకేమిటి?"

అతను ఇసుక దులుపుకుని లేచాడు. నేనింకా కూచునే వింటున్నాను -

అప్పుడతను చెప్పిన మాట అతనిలో పది సంవత్సరాల స్నేహానికి ప్రాతిపదిక అయింది.-

***మానవుడు బ్రతకడానికి, గొప్పగా బ్రతకడానికి, బ్రతకలేక పోవడానికి, బ్రతుకుతున్నామన్న అభిప్రాయానికి, చావుకీ - అన్నిటికీ ఓ అందమైన, తియ్యటి, విచిత్రమయిన కారణం - ఈ సృష్టిలో తయారయింది.***

అదే కారణాన్ని అతనూ ఆ ఉదయం చెప్పాడు.

"స్త్రీ"

2

నివ్వెరపోయాను.

ఆ బలహీనపు శరీరంలో, ఆ పల్చటి గుండె వెనక స్త్రీని గురించి ఆలోచించే వ్యవధీ, అవకాశం ఉన్నదా అని ఆలోచించాను.

కాని వామనరావు అందరికంటే మనస్సులో పది జీవితాలు ఎక్కువ బ్రతికాడు.

***అమాయకంగా కనిపించే వాడి గుండెలో అగ్నిపర్వతాలు తరుచు బ్రద్దలవుతూంటాయి. నిశ్శబ్దంగా కనిపించే స్త్రీలో ఊహించలేని పెద్ద ప్రళయాలు ఉండవచ్చునంటారే - అది.***

వామనరావు అందరిలాగా ప్రేమ వ్యవహారంలో పడ్డాడేమో ననుకున్నాను. ***మగాడిలో అందాన్ని చూసి ఏ స్త్రీ ప్రేమించదు. అందాన్ని ప్రదర్శించగల అతని నేర్పుకో, లేక అందరిలోనూ లేకుండా అతనిలో మాత్రం ప్రత్యక్షమయే ఏ గొప్పగుణానికో మూర్ఛపోతుంది. దానికి 'ప్రేమ ' అని ముద్దుపేరు పెట్టుకుంటుంది. అదిగో అక్కడినుంచి ఆత్మద్రోహం ప్రారంభమవుతుంది స్త్రీకి. అందుకనే ప్రేమ వ్యవహారంలో స్త్రీ మోసపోయినంత తరుచుగా మగాడు మోసపోడు సృష్టితః ప్రేమ విషయంలోనూ మగాడు మెటీరియలిస్టు -***

వామనరావును ఎవరో స్త్రీ ఆకర్షించింది - అనుకున్నాను. కానీ కాదు. ఎవరో స్త్రీకే వామనరావు ఆకర్షణీయంగా కనిపించాడు. మోసెస్ దగ్గరికి కొండ నడిచి వచ్చిందన్నమాట.

"మీకు ప్రేమలేదా?" అని అడిగాడు.

నవ్వాడు. ఆ పాత నవ్వే.

"ప్రేమంటే నాకింతవరకు తెలీదు. ఆ అక్షరాల్ని కాగితం మీద వ్రాయాలన్నా చెయ్యి వణుకుతుంది నాకు" అన్నాడు.

అతను తప్పు చెప్పాడు. ప్రేమకాదు, 'స్త్రీ' అనాలనుకుని ఉంటాడు.

"మీకు ప్రేమ లేనప్పుడు ఆవిడంటే ఎందుకంత తాపత్రయం?"

"ఆవిడని చూసింతర్వాత, కొన్నాళ్ళ తర్వాత ప్రేమ - ప్రేమకాదు పోనీ - ఏదో అటువంటి దగ్గరతనాన్నిచ్చే భావం ఉందనిపిస్తుంది. ఆమె నా దగ్గరే ఉండాలి. అప్పుడు చాలా కష్టాలు మరిచిపోగలుగుతాను" ఇలా ఏవేవో మాట్లాడుతున్నాడు.

ఇవన్నీ 'ప్రేమ'రోగికి లక్షణాల విలక్షణ గ్రంథాలలో ఇదివరకే రాసిపెట్టారు. నమ్మకం చాలని అదృష్టంతోనే చూస్తున్న నన్ను చెయ్యిపట్టుకు లేవదీశాడు.

"అయితే ఆమెను చూపిస్తాను రండి. అప్పటికి మీకే నమ్మకం కలుగుతుంది" అన్నాడు.

ఇంత జరిగినా ఆమెను చూడాలనిపించింది నాకు.

తాజ్‌మహల్ ప్రపంచంలోని మహాద్భుతమయిన దృశ్యాలలో ఒకటయితే, దానిని నిర్మించిన వ్యక్తిలో ఏదో అద్భుతం ఉండితీరాలి. వామనరావు ఓ పెద్ద విచిత్రం. మరి అతన్ని ప్రేమించే వ్యక్తి?

నిజమే వసుంధర చాలా విచిత్రమయిన వ్యక్తి. సన్నజాజి పందిరి వెనుక ఆ సాయంకాలం వెలుగులో నల్లటి ముఖాన్ని మొదటిసారి చూసిన మొదటి క్షణంలో అలా అనిపించింది నాకు.

"ఆమెతో ఎవరున్నారు? ఏం చదువుకుంది? ఏ ఊరు? ఇలాంటివి అడక్కండి" అని ముందుగా హెచ్చరించాడు వామనరావు.

"ఏం?"

"కొన్ని ఆవిడకీ తెలీదు - కొన్ని తెలిసినా చెప్పదు - తనని పెంచి పెద్దచేసిన ఎవరో ఫాదర్‌ని జ్ఞాపకం తెచ్చుకుంటుంది. అతనూ దాదాపు మూడేళ్ళక్రితం చచ్చిపోయాడు. ఆమె ఇప్పుడు ఒంటరి."

ఆంధ్ర రచయితల నవలల్లో పాత్రలాగ కనిపించింది వసుంధర.

"మరికొంచెం చెప్పండి ఆవిడ విషయం" అన్నాను ఆతృత తీరక.

"ఇక్కడే ఏదో కంపెనీలో టైపిస్టు. ఎస్.ఎస్.ఎల్.సి చదువుకుందనుకుంటాను. ఇంగ్లీషు అంతగా రాదు. ఎప్పుడన్నా అడ్రసు రాసినా రెండు మూడు తప్పులు రాస్తుంది. అయితే తనకి తెలియని విషయాలకి ఎక్కువ బాధపడదు."

ఇంతలో ఆ ఇంటికి వచ్చాం. అది ఇల్లుకాదు. ఎప్పుడో - ఎన్ని దశాబ్దాల కిందటో నిర్మించిన పెద్ద బంగళా. దాన్ని చీల్చి తడికలు బిగించి, వాటాలు చేసి పదిమందిని ఇరికించారు ఇంటి యజమానులు ఎప్పుడో పాత ఔన్నత్యాన్ని ఊహించుకుంటూ, చీకటీ వెలుగూ రాని ఆ బంగళా మారుమూల గదుల్లోపడి కుటుంబాలు మూలుగుతున్నాయి.

ఓ మూల గదివేపు తీసుకువచ్చాడు వామనరావు. ఆ గదికిముందు సన్నగా త్రోవ. ముందు కొబ్బరి రేకులతో పందిరి వేశారు. ఓ మూలనుంచి సన్నటి సన్నజాజితీగ పందిరిమీదకి బలహీనంగా ప్రాకుతోంది.

నన్ను పరిచయం చేస్తూంటే ఆమె ఏ ఆసక్తినీ ప్రకటించలేదు సరికదా, ముఖమన్నా ఎత్తి చూడలేదు. ఆ వెలుతురులో ఆమె ముఖం ఎర్రబడడం తెలిసింది. ఇట్లా రావడాన్ని అంగీకరించడం లేదు. కొత్త వ్యక్తి ఎవర్నయినా ఇలా తీసుకువచ్చేటప్పుడు, తన విషయం అతనితో చెప్పి ఉండాలి. అట్లా చెప్పడం ఆమెకు ఇష్టం లేదేమో మరి.

నమస్కారం చేసింది 'కూర్చోండి' అన్నట్టు గుర్తు. ఆ గదిలో కుర్చీలు లేవు. ఓ పక్క పరుపు నేలమీద పరిచివుంది. కూర్చోడానికి అదే గత్యంతరం. అక్కడ ఇద్దరం చతికిలబడ్డాం.

ఆమె జీవితమంతా ఆ ఒక్క గదికే పరిమితం. గదిలో గోడలకి ఓ ఫాదరీ ఫోటో, ఎవరో చిన్నపిల్లలు ఆడుకొంటున్న కాలెండరూ కనిపించాయి. ఓ పక్క గూడులో తెల్లటి చిన్న కృష్ణుడి విగ్రహం కనిపించింది. ఒక మూలకి దేవదారు పెట్టెమీద తెల్లని గుడ్డపరిచి ఏవో పుస్తకాలు ఉంచింది. మరొక మూలకి రెండు పెట్టెలు. ఇదీ ఆ గదీ, ఆమె జీవితం.

నేనంతా పరికిస్తున్నానని గమనించాక ఆమె మరీ సిగ్గుపడుతున్నట్టుంది. సిగ్గు, సంకోచం ఎక్కువయినకొద్దీ ఆమెకు అసలే మాటలు రావని వామనరావు అన్నాడు తరువాత.

వామనరావు సాధారణంగా ఎక్కువగా మాట్లాడాడు. ఆమెకూడా మాట్లాడదు కాని ఆ సందర్భంలో వామనరావే మాటకారిగా కనిపించాడు నాకు. ఏవో చెప్పడం ప్రారంభించాడు. నేనూ, ఆమె వింటూ కూచున్నాం. ముగ్గురం నిశ్శబ్దంగా కూర్చోవడం అతనికి భయమేమోమరి.

"వారం రోజులు క్రిందటివరకూ ఆయనెవరో తెలీదు నాకు. నన్ను బస్సులో ఎప్పుడూ చూసేవారట నేను చదువు మానేశానని తెలీదు మొన్న బీచ్‌లో కలిశారు. పలకరించారు. నామీద ఇంత అభిమానం చూపించే మిత్రులున్నారని నాకు తెలీదు" నవ్వాడు వామనరావు. కాని ఈ నవ్వులో ఇదివరకటి అందంలేదు. మాష్టారిముందు చేయకూడని పనికి సంజాయిషీ చెప్పుకున్నప్పటి బలహీనపు నవ్వు గుర్తుకొస్తుంది.

అప్పటికి ఆమె తలయెత్తలేదు. మరోసారి ఎప్పుడన్నా కలిస్తే ఆమె నన్ను గుర్తుపట్టగలదా అని సంశయం కలిగింది.

స్త్రీ అంతగా తన రహస్యాన్ని తనకే మిగుల్చుకోడానికి ప్రయత్నిస్తూందని అంతవరకు తెలీదు నాకు. నన్ను పరిచయం చేసినందుకు తరువాత వామనరావుని క్షమించే ఉంటుంది.

ఏదో పళ్ళరసం కలిపి ఇచ్చింది. తాగుతూనే లేచాను. 'నాకు కాస్త పనివుంది, పోతాను' అంటూ.

నేనూ వస్తానన్నాడు వామనరావు. మళ్ళీ నమస్కారం చేసి పందిరికిందికి దీపం తీసుకువచ్చి నిలబడింది. ముఖానికి దీపం దగ్గరయాక ఆమె ముఖం జాగ్రత్తగా గమనించాను. ఆమె అందంగా లేదు - కనీసం ఆశయాలతో, అసంతృప్తులతో కృంగిపోయిన వామనరావు ముఖంలో ఉన్న జీవంకూడా లేదు. ఆ నైరాశ్యంలో ఇద్దరూ పడుతున్నారేమో మరి. కానీ ఆమెలో ఏదో ఆకర్షణ ఉంది - ఒక్కసారి చూస్తే చాలాకాలం గుర్తుంటుంది.

బయటికి వచ్చాక వామనరావు అన్నాడు.

"మీరు అక్కడికి రావడం ఆవిడకు ఇష్టంలేదు. కనిపెట్టారా?"

నవ్వొచ్చింది నాకు.

"మరి నన్నెందుకు తీసుకెళ్ళారు?"

"నాకు తెలుసు అలా బాధపడుతుందని. ఆమె గురించి నేను ఒంటరిగా ఆలోచించుకోలేకపోతున్నాను. నాకు తోడు కావాలి. ఆమె గురించి చాలా ఆలోచించాలి నేను. అందుకని మిమ్మల్ని తీసుకువెళ్ళాను."

మన స్నేహం కలిసిన ఈ వారం రోజుల్లోనే ఇంత విశ్వాసాన్ని ప్రకటిస్తున్న అతనివేపు నిర్ఘాంతపోయి చూశాను. నెమ్మదిగా నిర్లిప్తంగా బ్రతికే ఈ వ్యక్తి ఇన్నాళ్ళూ స్నేహితుడికోసం ఎంత తపనపడ్డాడో అతని మాటల్లో అతని వేదనలో అర్థమయింది.

మరి వసుంధర నుంచి అతను ఆశించేది కూడా స్నేహమేనా? ఏమో మరి.

"ఆవిడ గురించి ఏం ఆలోచిస్తారు?" అనడిగాను.

అతనాలోచిస్తున్నాడు. ఆలోచించి ఆలోచించి మూడు యుగాలకి మాట్లాడాడు.

"ఆమెతో ఆరునెలల క్రిందట పరిచయముంది నాకు. అప్పట్నుంచీ ఆమె నన్ను క్రమంగా పాడుచేస్తోంది. భోజనం సరిగా సయించదు - నిద్రపట్టదు. ఆమెవల్లే చదువు మానేశాను. ఇప్పుడు ఇంటికి ఉత్తరాలు వ్రాయడం లేదు. చాలా నష్టపోతున్నాను నేను. ఇప్పుడు తీరుబాటుగా కూచుని ఈ నష్టాలకి తగిన ప్రతిఫలం ఏమన్నా ఉన్నదా అని ఆలోచించాలి."

"ఏమీ లాభం లేకపోతే?"

"ఇక ప్రశ్నేముంది? ఆమెకి దూరంగా పోవడం. ఆమెకి కనిపించకుండా పోవడం."

అంత కఠినమైన నిర్ణయం చేసే స్తోమత అతనికి ఉన్నదని అంతవరకు ఊహించలేదు నేను.

"రేపు మిమ్మల్ని తీరికగా కలుస్తాను. ఇంట్లో ఉంటారా?" అనడిగాడు కాస్సేపటికి.

"ఉంటాను, రండి" అన్నాను.

"వసుంధర గురించి వీలయినంత ఆలోచించండి. రేపు చాలాసేపు మాట్లాడుకుందాం" అని వెళ్ళిపోయాడు.

**కానీ మర్నాడంతా ఎదురు చూసినా** వామనరావు జాడ కనిపించలేదు. వసుంధర ఆలోచనల్తో తల దిమ్మెక్కి పోయింది. అతనికంటే ఎక్కువగా ఆలోచించి ఉంటాను ఆవిడగురించి.

కనిపించని దేవుడి గురించో, గారడీవాడి చేతిక్రర్రతో మాయమయిన పేకముక్కని గురించో ఆలోచిస్తే ఏం తెలుస్తుంది?

వసుంధర రంగూ, రుచీ, వాసనా లేని ఓ జడపదార్థం. ప్రయోగశాల బల్లమీద ఉన్న మూలఖనిజం. ఎనలైజు చేసి ధాతువుల్ని వేరు చేస్తే బంగారం బయట కొస్తుందో, బొగ్గు బయటపడుతుందో చెప్పలేం.

ఈ మాటలు చెపుదామనే మనస్సులో వెయ్యిసార్లు కాపీలు దిద్దుకుని వామనరావుకోసం ఎదురుచూస్తూ కూచున్నాను కానీ అతను ఆ రోజు రాలేదు. మరునాడు రాలేదు. మరి నెలరోజులవరకు కనిపించలేదు.

మిత్రుడి మాటలలో ఇంతగా ఎప్పుడూ మోసపోలేదు నేను. అతనిమీద విసుగూ, అతనిపై అంత శ్రద్ధను ప్రకటించినందుకు నామీద నాకే కోపం కలిగింది. బస్సులో కూచుని అనామకంగా పోయే వ్యక్తికోసం ఇంత తాపత్రయం ఎందుకు?

కానీ 40 రోజుల తరువాత ఏలూరు నుంచి ఉత్తరం వచ్చింది - వామనరావే రాశాడు.

తను హఠాత్తుగా ఏలూరు బయలుదేరి వెళ్ళవలసి వచ్చిందని, ఏమీ అనుకోవద్దని వ్రాశాడు. "మీతో స్నేహం చేశాక మీకు తెలియకుండానే నేను మారుతున్నాను. ఏలూరు రావడానికి కారణం మీరే. ఎలాగో వచ్చాక చెప్తాను. ఓ పుస్తకం పంపుతున్నాను. దయచేసి దాన్ని వసుంధరకి అందజేయండి. మీకు పంపుతున్నందుకు ఏమీ అనుకోవద్దు. ఆమెకు పంపడం సాధ్యం కాక మీకు పంపాను. శుక్రవారం నాడు వస్తాను. మీరు వాల్తేరు స్టేషన్‌కు వస్తే చాలాసేపు మాట్లాడుకుందాం" ఇదీ ఉత్తరంలో విషయం.

ఎంతకాదనుకున్నా అతనిలో ఏమూలో చిత్తశుద్ధీ, నిజాయితీ తోచింది. కానీ వసుంధరకి నేను ఉత్తరం ఇవ్వడమేమిటి? ఈ పనికి విసుగు కలిగింది. ఆ రోజు వెళ్ళి వచ్చాక ఆమె మీద నాకు పెద్ద సదభిప్రాయం ఏర్పడలేదు సరికదా, ఇక ఎప్పుడూ అక్కడికి రావడం మంచిదికాదనిపించింది. ఇంగ్లీషులో ఓ వాక్యం ఉంది - కొందరు తాము ఉన్నచోట సంతోషం కలిగిస్తారట - మరికొందరు తాము లేనిచోట సంతోషాన్ని కలిగిస్తారట - తాను వెళ్ళకపోవడంలోనే, ఆ విషయంలో జోక్యం చేసుకోకపోవడంలోనే ఆమెకు తృప్తి కనిపించేటట్టుంది.

కానీ వెళ్ళక తప్పలేదు. మొదటిసారి తెలియక, రెండవసారి తెలిసీ ఆమె విషయంలో జోక్యం తప్పనిసరి అయింది.

నన్ను చూడగానే ఆశ్చర్యపోయింది వసుంధర. ఆ రోజు నన్ను గుర్తు ఉంచుకోనిమాట నిజమే. గుర్తుచేస్తే 'అవునవును' అంది;

"ఆయన మీకు ఉత్తరం వ్రాశారు. మీకు అందజేయమని పంపారు నాకు."

ఆమెకు ఆశ్చర్యాన్ని ప్రకటించడం కూడా సరిగా తెలీదనిపించింది, 'మీకెందుకు పంపారు?'

"ఆ ప్రశ్నకు సమాధానం సరిగా వ్రాయలేదు వామనరావుగారు. మీకు పంపడం సాధ్యంకాలేదట. ఉత్తరం చదవండి" ఇచ్చాను. అది చదివేటప్పుడు ఆమె ముఖం చూడాలని ఆసక్తి. ఆ ఒక్క ఆసక్తికి కాకపోతే ఆ ఉత్తరాన్ని ఓ కవరులో ఉంచి అడ్రసురాసి పోస్టాఫీసులో పడేసేవాడిని. ఆమెకు రాసిన ఉత్తరాన్ని వేరే కవరులో పెట్టి పంపలేదు. వామనరావు ఉత్తరమంతా చిన్న, పల్చటి కాగితం మడత. అంతా తెల్లగా ఉంది -ఇంకొకరి ఉత్తరాలు చదవడం చాలా అసహ్యకరమయిన పని అయినా, చాలా ఆసక్తిని కలిగించే పనిమాత్రం అవును. మరొకరి రహస్యాన్ని ఎక్స్‌ప్లోయిట్ చెయ్యడంలోనే ఆ ఆనందం ఉందేమో. కానీ అది ఘోరమైన తృప్తి. ఆ ఉత్తరం చదవాలని నాకు లేదు. కానీ టేబులు మీద గాలికి పలుచటి కాగితం రెపరెపలాడి ఇటు పడితే రెండు వాక్యాలే కనిపించాయి. గుండె ఝుళ్ళుమనిపించింది.

'వసూ! నేనింకా చచ్చిపోలేదు. త్వరలో కలుస్తాను.'

ఆ వాక్యాలు చదివాక వసుంధర నవ్వుకుంది. మడిచి పక్కన ఉంచింది. 'ఎప్పుడొస్తారో రాశారా!' అంది కాస్సేపటికి.

"శుక్రవారం వస్తారని రాశారు. మీకు రాయలేదా మరి" తెలియనట్టు అడిగాను.

నవ్వింది. వామనరావు దగ్గరే ఆ నవ్వు అలవాటయిందేమోననిపించింది. నవ్వితే చిన్ననోరు వెడల్పయి, నల్లటి పల్చటి పెదాలు వణుకుతున్నట్టుంటాయి. ఆమెలో అందమేదన్నా ఉందా అని ప్రశ్నిస్తే - తప్పనిసరిగా ఆ పెదాల్ని మాత్రమే ఉదాహరణగా చెప్పాలి.

"వెళుతున్నట్టు మీకు చెప్పలేదా?"

"లేదు"

"ఎందుకు వెళ్ళారో తెలుసా!"

"తెలీదు"

"ఎక్కడికి వెళ్ళారో తెలుసా పోనీ?"

"ఇంటికి అనుకుంటాను - అక్కడే అంతా ఉన్నారని ఓసారి అన్నారు."

"మీరు అతనికోసం ఎదురు చూస్తున్నారా?" అని అడిగాక ఆమె ముఖంలో దిగ్భ్రమ చూసి నాలిక కరుచుకున్నాను.

ఎందుకు అడిగానా అని పదిసార్లు ఆలోచించిందనుకుంటాను. ఆ ప్రశ్నకు జవాబు చెప్పడంలో ఆమె మనస్సంతా బయటపడుతుందని భయంకాబోలు. తికమకపడుతోంది. నేను లేవబోయాను. అప్పుడు చెప్పింది.

"ఎదురుచూడడంలేదు కానీ మరిచిపోలేదు ఆయనేవో కష్టాల్లో ఉన్నట్టున్నారు. ఏదీ అడిగితేగానీ చెప్పలేదు. నేను ఎప్పుడూ అడగలేదు."

లేచాను. గుమ్మందకా వచ్చాను, "నాకు ఆయన మీ ఉత్తరాన్ని పంపడంలో అర్థం ఏమిటో బోధపడలేదు. కానీ ఇలా చొరవచేసుకున్నందుకు ఏమీ అనుకోకండి. నాకు మీ విషయాల్లో జోక్యం చేసుకోవాలన్న ఆలోచన ఎప్పటికీ లేదు."

నిజంగా అప్పుడు చలించినట్టు కనిపించింది వసుంధర.

"మరేం ఫరవాలేదు. మీరు ఆయనకి మంచి స్నేహితులని తెలిసింది. నాకేమీ బాధలేదు. ఎప్పుడన్నా వస్తూండండి" అంది.

ఇదివరకటికంటే ఇప్పుడు కాస్త నోరువిప్పి మాట్లాడడం కాస్త తృప్తిని కలిగించింది. కానీ ఏమిటి వసుంధర? ఇంకా అర్థం కాలేదు.

శుక్రవారానికి 48 గంటల వ్యవధి ఉంది. కానీ 48 యుగాలు గడిపాను ఆ తర్వాత.

## *4*

***రెండు క్షణాలు చాలునంటారు మనిషి, మనస్సూ మారడానికి. ఇదివరకు నాకంత నమ్మకం ఉండేది కాదు.*** ఆరోజు వామనరావుని చూశాక నమ్మకతప్పలేదు. ***మనకున్న విశ్వాసం తప్పని రుజువుపరిచే బలమైన కారణానికే 'మార్పు ' అని పేరుపెట్టుకున్నాం మనం. మార్పుకు ఒదిగి బ్రతికేవాడు విజ్ఞుడు. ఎదిరించి బ్రతికేవాడు విప్లవవాదీను.***

మొదటినుంచీ వామనరావుని పోలిక పట్టలేకపోయాను. పక్కనుంచే వచ్చి భుజం మీద చెయ్యివేశాక నిర్ఘాంతపోయాను. అసలే సన్నటి మనిషి, మరింత పల్చబడి, నీరసించి మృత్యువుతో పోటీపడుతున్నట్టున్నాడు. ఓ గాలి విసురుకూ, మధ్యాహ్నపు ఎండతాకిడికీ, గుండెపగలగొట్టే ఒక్కమాట పదునుకీ, కాస్త మనస్సుని కదిపే సంతోషానికీ దేనికయినా కుప్పలాగ కూలి, తట్టుకోలేక మరణించేట్టు కనిపించాడు.

''వామనరావుగారూ!'' అన్నాను ఆశ్చర్యపోయి

''అవును, చాలా మారిపోయాను. చెపుతాను రండి'' అన్నాడు.

ఇప్పుడు నవ్వు వికృతంగా తయారయింది. దవడలు పీక్కుపోయి, కళ్ళు వెళ్ళుకొచ్చి నవ్వితే పెద్ద తెగింపు కనిపిస్తోంది. ఇంత నీరసించాక కళ్ళ ప్రాముఖ్యం ఆ ముఖంలో తెలుస్తోంది. పదునుగా పృచ్ఛిస్తున్నట్టున్నాయి.

స్టేషన్ గందరగోళం నుంచి బయటపడ్డాక ''అంత హఠాత్తుగా మాయమయిపోయారేం?''

నవ్వాడు ''ఇంకా అవన్నీ గుర్తుకురావడంలేదు నాకు. అయిదురోజుల క్రిందట అమ్మ చచ్చిపోయింది. ఆవిడని ఇంకా మరిచిపోలేకపోతున్నాను'' అన్నాడు.

దిమ్మపోయాను. కాస్సేపటివరకూ ఏం చెప్పాలో తోచలేదు. ఎందుకు చచ్చిపోయింది? ఎలా చచ్చిపోయింది? ఇవన్నీ వరసగా ధ్వనించే ప్రశ్నలు - సమాధానాలు చెపుతున్నాడు వామనరావు.

''మీకు తెలుసా? మా అమ్మని నేనే చంపుకున్నాను. అంత సమర్థుణ్ణి. ఇక ఏం చెయ్యలేను నేను. అమ్మ చచ్చిపోయాక, ఆ దుఃఖాన్ని భరించాక వసుంధరని పెళ్ళిచేసుకున్నా అంతకన్నా కష్టం ఏదీ లేదనిపించింది. ఇక అక్కడ ఉండలేక పారిపోయొచ్చాను''

''ఎందుకు చచ్చిపోయిందావిడ?''

''నేను పెళ్ళి చేసుకుంటానని నాన్నగారితో చెప్పడానికి ఏలూరు వెళ్ళాను రాత్రికి రాత్రి. మీరు వెళ్ళిపోయాక ఎంతకీ ఈ సమస్య తెగక, చివరికి ఈ ఆలోచన తోచింది. వెంటనే వెళ్ళి రైల్లో కూచున్నాను'' అని జేబులోంచి ఏదో పొట్లం తీసి దాన్ని విప్పాడు మధ్య ముక్కలు ముక్కలయిన ఫోటో - ఎవరిదో ఉంది.

''నాకు నాన్నగారిచ్చిన సమాధానం ఇది. ఆయన చాలా కోపిష్టి. ఈ ఇరవై ఏళ్ళలో తలెత్తి ఎప్పుడూ ఆయనముందు మాట్లాడలేదు. మా భాషనీ అమ్మే ఎప్పుడూ మాట్లాడేది. ఆ రోజు రాత్రి ఈ ఫోటోని చూపి నా మొహం మీద విసిరేశాక, మొదటిసారి తలెత్తి నాన్నగారి కళ్ళు చూశాను. అభిజాత్యంతో మండిపడుతున్నారు. మొదటిసారి నాన్నగారు అమ్మను కొట్టారు. మొదటిసారి నేను

నాన్నగారిని తిట్టాను. నా దూకుడుకి నాన్నగారు నిర్ఘాంతపోయారు. నేను అలా తిరగబడతానని ఆయన ఊహించి ఉండరు. తెల్లబోయి, నివ్వెరపోయి, నిస్సహాయులయిపోయి అంత పులిలాంటి మనిషి ఓ కుర్చీలో మూలకి చదికిలబడిపోయారు. అప్పుడాయన్ని చూశాక ఏడ్చేశాను. ఇక ఆ తరువాత ఆయన నాతో మాట్లాడలేదు. పక్షవాతం వచ్చిన వ్యక్తిలాగ ఆ కుర్చీలోనే రాత్రంతా కూర్చున్నారు. ఏ రాత్రివెళ్ళి పడిపోయిందో తెలియదు. తెల్లవారేసరికి అమ్మ శవం పక్కనున్న బావిలో తేలింది. అప్పుడు నన్నుచూసి నాన్నగారు నవ్వారు. "ఇప్పుడిక నీ ఇష్టం" అన్నారు ఇక ఇంట్లో ఉండలేకపోయాను"

29 ఏళ్ళక్రిందట జరిగిన సంఘటనని ఓ రోజు కథలో గుర్తుచేసుకుంటున్నట్టు తాపీగా చెప్పాడు వామనరావు 'అమ్మ చచ్చిపోయింది' అన్నప్పుడు ఏడుస్తాడేమోననుకున్నాను కానీ లేదు. నిశ్చలంగా ఉన్నాడు. బహుశా వెయ్యిసార్లు నిశ్శబ్దంగా రోదించి ఉంటాడు. వెయ్యిసార్లు అలిసిపోయి ఉంటాడు

"వామనరావుగారూ!" అని పలకరించాక మేలుకున్నాడు.

"ఇప్పుడేం చేస్తారు?" అన్నాను.

నవ్వాడు. "నేను చెయ్యవలసింది ఏమీ లేదు. అమ్మ చచ్చిపోయింది. నాన్న నా గురించి పట్టించుకోడు. అమ్మ లేకపోతే, నాన్నగారిని అభిమానించడం, ఆయనతో మాట్లాడడం కూడా ఎవరికీ తెలీదు. అమ్మపోతే, మాకు నాన్నకూడా పోయినట్టే మా అక్కయ్య ఒకామె ఉంది. ఆమెకి పెళ్ళయింది. వాళ్ళు ఈ పాటికి వచ్చి ఉంటారు పుట్టుకనుంచీ కళ్ళులేని 18 ఏళ్ళ తమ్ముడు ఉన్నాడు. వాడికోసం నాన్నగారు బ్రతికి ఉండాలి"

"ఆయనేం చేస్తారు ఏలూరులో?"

"ఓ హైస్కూలు హెడ్ మాస్టరు. ఉద్యోగం మీద కాదు. ఆ ఊరు మీద అక్కడి ఇంటిమీద ఆయనకు అభిమానం. అక్కడినుంచి కదలనని ఆయన పట్టుదల."

"ఇప్పట్లో పెళ్ళి విషయం అక్కడ కదపకుండా ఉండవలసింది" అన్నాను.

అప్పుడిక దుఃఖం ఆపుకోలేకపోయాడు. ఒక్కసారి రెండు చేతుల్లో ముఖం కప్పుకున్నాడు. "అది తెలుసుకోడానికి చాలా నష్టపోయాను. అమ్మని వదులుకుని ఓ పెద్ద నిజాన్ని తెలుసుకున్నాను."

అతనికి ఎంతలేదన్నా 23 ఏళ్ళు లేదా 25 ఏళ్ళుంటాయి. బహుశా ఈ చదువుకి తప్ప ఇల్లువదిలి ఎప్పుడూ బయలుదేరి ఉండడు. ఎంతగా అమ్మకు అతను అతికిపోయి ఉన్నాడో అతని మాటలు, ఆ బాధా చూసి అర్ధమయింది. కొందరు 20 ఏళ్ళు వచ్చినా ఇంకా ఆ సాన్నిహిత్యాన్ని దాచుకుని తల్లి ఒడిలో బ్రతుకుతారు, అది వాళ్ళ అదృష్టం. తల్లి పోవడం అందరికీ దుఃఖమే. కానీ వామనరావుకి అది ప్రత్యేకమైన కష్టం.

ఇంత జరిగాక, ఇంత తెలిశాక అతను వసుంధరనుంచి ఏం ఆశిస్తాడు. అర్ధమయింది నాకు.

ఎలా అతన్ని ఓదార్చాలో అర్ధంకాలేదు. అతనే కాస్సేపటికి తేరుకున్నాడు. నన్ను చూసి హఠాత్తుగా నవ్వాడు. "మీ స్నేహం విషయం నాన్నగారితో చెప్పాను. మిమ్మల్ని తిట్టారు. మీవల్ల నేనిలా పాడయానన్నారు. అప్పుడు మనసులో అనుకున్నాను. మీ వల్ల ఇంత బాగుపడ్డానుకదా అని" నవ్వుతున్నాడు.

కన్నీరు నిండిన కన్నీళ్ళతోనే నేను ఆశ్చర్యపడుతున్నాను. నా చేతులు పట్టుకుని "ఏమీ బాధపడరుకదూ! నాన్నగారు చాలా ముసలాయన. కొడుకు మీద ప్రేమతో తిట్టారు. మీమీద కోపంతోగాదు" అన్నాడు.

ఇంకా చిన్నపిల్లలలోని స్వచ్ఛత, మార్దవం వామనరావులో మిగిలేఉంది. అందుకే వసుంధర అతన్ని క్షమించింది. వసుంధరలో మంచితల్లి కనిపించింది వామనరావుకి. అందుకే ఆమె అంటే అతనట్లా ఆకర్షితుడయాడు.

"వసుంధరని కలిశారా?" అని అడిగాడు ఉన్నట్టుండి.

చెప్పాను వివరంగా.

"మీకు మంచి స్నేహితుడంటే, మీతో తన విషయాలు చెప్పడానికే అంగీకరించలేదు ఆమె మొదట. అందుకని మీమీద విశ్వాసం ఏర్పడాలని మిమ్మల్ని వెళ్ళమన్నాను. మీ మేలు మర్చిపోను" అన్నాడు.

"మరి ఏలూరు విషయాలన్నీ చెప్తారా?" అని అడిగాను.

అంతవరకూ ఆ సంగతి ఆలోచించినట్టులేదు వామనరావు. నేనడిగాక ఎంతో సేపు మాట్లాడలేకపోయాడు. చివరికి అన్నాడుకదా.

"చెప్పను. ఎందుకు చెప్పాలి? మా అమ్మ చచ్చిపోతే ఆవిడకేం బాధ? వసుంధర బాధపడుతుందేమోనని మరింత తొందరగా వచ్చాను. అమ్మలేదు నాకు. ఇక వసుంధర ఒక్కతే మిగిలింది" అన్నాడు.

నాకు 50 ఏళ్ళ వయస్సుంటే వామనరావుని అప్పుడు బుజ్జగించి, దగ్గరికి తీసుకొని, భుజం తట్టేవాడిని. అంత చిన్న కుర్రాడు అయిపోయాడు.

## 5

మరి పది పన్నెండు రోజుల తరువాత అనుకొంటాను - ఓ ఉదయం నన్ను వెదుక్కుంటూ వచ్చి ఈ విషయం చెప్పాడు వామనరావు.

చాలా రోజులుగా ఊహిస్తున్న విషయమే అయినా వామనరావు ఇంత త్వరగా ఒక నిర్ణయానికి రాగలడని, ఇంత త్వరలోనే ఆ తతంగం కూడా ముగుస్తుందని ఊహించనయినా ఊహించలేదు. అందుకని అతనా విషయం చెప్పగానే ఒక్క క్షణం ఊపిరాడలేదు.

"నేను వసుంధరని పెళ్ళి చేసుకుంటున్నాను" అన్నాడు. ఆ వాక్యంలో ప్రశ్నలేదు, సంశయం లేదు. ఎన్నో సంవత్సరాల ఆలోచన తరువాత రూఢిగా వచ్చిన ఒక నిర్ణయం తెలుస్తోంది.

ఇంకేం అడిగే వ్యవధి ఇవ్వలేదు. ఒకే ఒక ప్రశ్న మిగిలింది నాకు. "ఎప్పుడు?"

"మీకు తీరుబాటు దొరికినప్పుడు."

పక్కున నవ్వేశాను. "అంత సుళువా వామనరావుగారూ - పెళ్ళిచేసుకోవడం, మొదట కూచోండి. అసలు విషయం విపులంగా చెప్పండి" అని కదిపాను. అసలు మొదట ప్రశ్నల్ని అడిగే ధోరణే సరిగా లేదని ఇప్పటికి అర్థమయింది.

"వసుంధరతో ఆలోచించాను. ఆమె ఏమీ మాట్లాడలేదు. నా మట్టుకు నాకు ఇక ఎందుకు ఆగాలో తెలియడం లేదు. పెళ్ళిచేసుకుంటేనేం?"

"ఉండండి. మరో ప్రశ్న వేసుకోండి, ఇప్పట్లో చేసుకోకపోతేనేం?"

నవ్వేడు "పదిసార్లు ఆ ప్రశ్న గుర్తు తెచ్చుకున్నాను. వసుంధరకు నామీద నమ్మకం పోవచ్చు, లేదా ఆమెకు ఇక్కడినుంచి బదిలీ కావచ్చు, నాన్నగారికి మళ్ళీ పక్షవాతం ముంచుకు రావచ్చు, అన్నిటికీ మించి - నాకు ఈలోగా పిచ్చి ఎత్తవచ్చు. దీనిలో ఏది జరిగినా పెళ్ళి జరగదు -"

"ఇప్పుడు పెళ్ళి జరిగిపోతే -"

"అప్పుడు ఏం జరిగినా ఈ సంబంధాన్ని గుర్తుంచుకునే ఏ నిర్ణయమన్నా చేయవచ్చు"

"మీ నాన్నగారికి ఈ విషయం చెప్పారా?

అది గుర్తుచెయ్యగానే వామనరావు ముఖంలో మళ్ళీ పాత బాధ కనిపించింది. "చెప్పలేదు, చెప్పను. అమ్మ పోయాక - నావల్ల పోయాక - ఇక ఆయన నాగురించి పట్టించుకోరు - పట్టించుకోనని ఒట్టు వేసుకున్నారు. అందుకని ఆయనకి ఈ విషయంలో ఉత్తరం రాసినా సమాధానం రాదు. వెళ్ళి అడిగితే ఏ సమాధానం వస్తుందో తెలియనే తెలిసింది"

"మరి ప్రతినెలా డబ్బు పంపుతున్నారా?"

"పంపుతున్నారు; చదువు మానేసినట్టు ఆయనకింకా తెలియదు"

"వామనరావుగారూ! - పెళ్ళి చేసుకోవడం చాలా సులువుగా జరిగిపోతుంది. కానీ మీకింకా చదువు పూర్తికాలేదు, మధ్యలో ఆగిపోయింది. మిమ్మల్ని మీరు పోషించుకుని, మరొకర్ని పోషించడానికి కనీసం రెండు సంవత్సరాలయినా కావాలి. అంతవరకు మీకు ఇంటినుంచే డబ్బురావాలి, మీ నాన్నగారికి ఈ పెళ్ళి ఇష్టం లేదన్నారు; మరి పెళ్ళి జరిగాక ఏమవుతుందో ఆలోచించారా?"

చాలాసేపు నిశ్శబ్ధంగా ఉండిపోయాడతను.

చాలాసేపు నిశ్శబ్ధంగా ఉండిపోయాడతను.

"మీరు పెళ్ళి చేసుకుంటున్నట్టు తెలిస్తే మీనాన్నగారికి గుండె రగులుతుంది. డబ్బు పంపరు. పెళ్ళిరోజున ఉన్న కాస్త సంతోషం మర్నాడు మాయమవుతుంది. ఆవిడకే మీరు పెద్ద బరువుగా తయారవుతారు. ఆమెకు ఎవరూ లేకపోవడం ఒక విధంగా నయం. ఆ 130 రూపాయల జీవితంలో మీరిద్దరూ బ్రతకాలి. కానీ అది బాగుంటుందా? ఆలోచించండి"

ఇవన్నీ గుర్తుచేస్తూంటే విపరీతంగా బాధపడుతున్నాడు వామనరావు అభిమానం, ఆత్మరక్షణమధ్య పెద్ద పోరాటం అతని ముఖంలో ద్యోతకమయింది.

"అయితే ఇప్పుడు నన్నేం చెయ్యమంటారు?"

"మరికొన్నాళ్ళాగండి. తొందరగా మళ్ళీ చదువు ప్రారంభించండి. బ్రతకడానికి, సుఖంగా మీరు సిద్ధంగా ఉన్నారనిపించేంత వరకూ పెళ్ళిని వాయిదా వెయ్యండి" అన్నాను.

వామనరావు ఇంకా గిజగిజలాడిపోతున్నాడు. యువకుడు, వేడిరక్తం. పెళ్ళికి తొందరపాటు అర్థమవుతోంది. కానీ ఆ ఉద్రేకంలో జీవితంలో పెద్ద పొరపాటు చేస్తాడేమోనన్న ఆతృత ఎక్కువయింది నాకు.

"ఆమె ఏమంటుంది?"

"నా ఇష్టం వచ్చినట్టు చెయ్యమంటుంది తనేమీ చెప్పదు. కాదనదు. నిశ్శబ్ధంగా ఊరుకుంటుంది. అందుకే నాకు మరీ బాధ. ఇప్పట్లో అమ్మ బ్రతికి ఉంటే ఎంత బాగుణ్ణు? నన్నర్థం చేసుకుని ఓదార్చేది!"

"మీకంత కష్టం ఏమొచ్చింది గనుక? - పెళ్ళిమానమని అనడం లేదుకదా? - కొంతకాలం వాయిదా వెయ్యమంటున్నాను. అందువల్ల బాగా లాభాలుంటాయి."

"కానీ వాయిదా వెయ్యడానికి వీలులేదు సార్. మీకు తెలీదు, వీల్లేదు" ఉద్రేకంగా అన్నాడు. అతనిలో హఠాత్తుగా వచ్చిన పరిణామానికి ఆశ్చర్యపోయి చూస్తున్నాను. అతను కాస్సేపయాక తలెత్తాడు.

విచిత్రం. అతను నిజంగా ఏడుస్తున్నాడు. కళ్ళవెంట బొటబొటా నీరు కారుతోంది.

"వామనరావుగారూ..!" అన్నాను నిర్ఘాంతపోయి. "మీరు నాకు చాలా దగ్గర మిత్రులు. మీ ఒక్కరి సలహాయే నాకు ముఖ్యం. ఒక్క సంగతి మీకు ఇంతవరకు చెప్పలేదు. వసుంధర తల్లి కాబోతోంది మరి ఏడునెలల్లో ఇప్పుడు నన్నేం చేయమంటారో చెప్పండి."

చలికాలపు ఉదయాన ఒక్కసారి చల్లటినీళ్ళు మీద పడ్డట్టు ఉలిక్కిపడ్డాను. క్షణకాలం ఏమీ తోచక తికమకపడిపోయాను. దిమ్మరపాటుకి తట్టుకోలేకపోయాను. లేచి గదిలో పచార్లు ప్రారంభించాను. వామనరావు తలని రెండు చేతుల్తో పట్టుకుని నిశ్శబ్ధంగా కూచున్నాడు.

ఓ పావుగంట తర్వాత నేను తలెత్తితే అతని కళ్ళు కనిపించాయి. నేనూ ఉద్రేకపడుతున్నట్టనిపించింది.

"వామనరావుగారూ! మీరు వెంటనే పెళ్ళిచేసుకోవాలి. అందువల్ల మీరు పూర్తిగా నాశనమయిపోయినా సరే" అన్నాను.

*6*

**నా నిర్ణయానికి క్షణకాలం** తట్టుకోలేకపోయాడు వామనరావు.

"బాగా ఆలోచించే సలహా ఇస్తున్నారా మీరు?" అన్నాడు సంశయంతో.

నవ్వాను. "ఆలోచించడానికి ఇక అవకాశం మిగల్చలేదు మీరు. మంచికీ, చెడుకీ అవకాశాల్ని వెదుక్కునే సమయం దాటిపోయింది వసుంధరని ఇప్పుడు మీరు పెళ్ళి చేసుకు తీరాలి. ఒక్క క్షణం ఆలశ్యం చేస్తే ఆమె ఏ ప్రయత్నానికన్నా పూనుకోవచ్చు. మొగాళ్ళకంటే ఆడవాళ్ళకి ధైర్యం, తెగింపు ఎక్కువ అంటారు. ఆవిడ చచ్చిపోతే మీరిక జీవితాంతం ఆ చావుతో సతమతం కావాలి" అదొక్క ఆలోచనే నాకా క్షణంలో పోయింది. ఊహించినదంతా మాటల్లో కూర్చిపెట్టానతనిముందు. వసుంధర ఆత్మహత్య విషయం సూచించగానే అదిరిపడ్డాడు. లేచి నిలబడ్డాడు. నా రెండు చేతులూ పట్టుకున్నాడు. "మనం త్వరపడాలి" అని నాలుగుసార్లు అన్నాడు. ఆ తరువాత పెళ్ళి అయేవరకు అతను స్థిమితంగా ఉండడం నేను చూడలేదు.

తరువాత వసుంధరతో ఒకసారి నేను కూడా మాట్లాడాలని నిశ్చయించాను. ఎందుకు మాట్లాడడం? నదిలో మునిగిపోతున్న వ్యక్తి ఉంటాడు - వాడికి ఈతరాదు వాడిని రక్షించేముందు 'బ్రతకడం నీకిష్టమా కాదా?' అని సలహాలు తీసుకునే వ్యవధి ఉంటుందా? - ఆ సలహా అవసరమా? వసుంధరను ఇప్పట్లో నేను కలవకపోయినా పరవాలేదన్నాను, కానీ పట్టుబట్టాడు వామనరావు. ఆమె అభిప్రాయాలు కనుక్కోవాలన్నాడు.

తల్లి కాబోతున్న స్త్రీకి ఒక ఠీవి వస్తుందనుకొంటాను. సామ్రాజ్ఞి కావడానికి ముందు రాణీలో కనిపించే నిండుదనం, తృప్తి - అట్లాంటివేవో కనిపిస్తాయి. శరీరాన్ని జయించే ఐశ్వర్యం మనస్సుకి దక్కుతుంది. హృదయం వెయ్యి రాజ్యాలకు ఆధిపత్యక, మనస్సు నిండిన సంతోషం, భవిష్యత్తుమీద కలల ఉక్కిరిబిక్కిరి - (తల్లి కాబోయే స్త్రీమీద 24 ఏళ్ళు నిండని ఈ రచయిత (అప్పటి) ఆలోచనలవి.)

ఆ అంచనాలతో, ఊహలతో ఆమె దగ్గరికి వెళ్ళాను. నాకా విషయం తెలిసిందని వినగానే ఆమె బిత్తరపోయింది. వెనకనుంచి ఎవరో బాకుతో హఠాత్తుగా పొడిస్తే - వెనక్కి తిరిగేసరికి ఆ పొడిచింది జీవితాంతం ప్రేమించిన వ్యక్తే అయితే ఎట్లా ఉంటుంది? - ఆ కళ్ళల్లో ఆశ్చర్యానికి ఇది మంచి ఉదాహరణ కాదు. ఒక్కటి మాత్రం అర్ధమయింది. ***భర్తకీ, తండ్రికీ, చివరికి దేవుడికి అందని కొన్ని రహస్యాల్ని స్త్రీ తనకు తానే మిగుల్చుకోవడానికి ప్రయత్నిస్తూంటుంది*** అనిపించింది. లేదా ***తనకు సంబంధించిన ప్రతివిషయం ప్రపంచానికి***

***తెలియని పెద్ద రహస్యం అనుకుంటూ ఉంటుందనుకుంటాను. అందుకనే తన అందాన్ని ప్రపంచం గుర్తిస్తే ఆశ్చర్యం, తన తప్పును ఎత్తి చూపితే దుఃఖం, తన లోపాన్ని గమనిస్తే భయం - ఇట్లా.***

***ప్రపంచాన్నంతటినీ సృష్టించి ఒక స్త్రీని సృష్టించి ఉండకపోతే దేవుడి గొప్పతనాన్ని మనం అంగీకరించకపోయే వాళ్ళమేమో*** అనిపిస్తుంది నాకు.

ఆ విషయమ్మై మరొక క్షణం మాట్లాడానో లేదో ఏడ్చేసింది. "అవును, మీకు తెలిసింది నిజమే. నన్నేం చెయ్యమంటారు?" అంది.

"మరి ఆ ప్రశ్న ఆయన్ని అడగలేదా?"

"అడిగాను. ఆయనకేం తోచక మీ దగ్గరికి పరిగెత్తుకు వచ్చారు. మా ఇద్దరికీ స్నేహితులు మీరు మీకెలా మంచిదనిపిస్తే అలా చేయండి"

చాలాసేపు ఆమెను గమనిస్తూ కూచున్నాను. ఏదో అల్లికపని చేస్తోంది. నల్లటి వేళ్ళమధ్య తెల్లటి దారం మెలికలు తిరుగుతూ ఏదో లేడి బొమ్మని తయారుచేస్తోంది.

"చావంటే మీకు భయమా?" అన్నాను.

ఆమె నివ్వెరపోయింది. "ఎందుకలా అడిగారు?"

***"మగాళ్ళు ఒక సమస్యని పరిష్కరించాలని చూస్తారు. ఆడవాళ్ళు దానినుంచి తప్పించుకోవాలని చూస్తారు. అందువల్ల ఆత్మహత్య అవకాశంగా ఆడవాళ్ళకి స్ఫురించినట్టు మగవాళ్ళకి స్ఫురించదు.*** మీమీద అదొక్కటే భయం."

ఆమెకి ఇప్పుడర్థమయిందనుకుంటాను, నవ్వింది. అల్లిక నిలిచిపోయింది. "నేను ఆత్మహత్య చేసుకుంటానని ఆయన భయపడుతున్నారా?"

నాకు నవ్వొచ్చింది. "లేదు, ఆయనే ఆత్మహత్య చేసుకుంటాడేమోనని భయపడుతున్నారు. మీకూ ఆ ప్రమాదం ఉందన్నాను సూటిగా చెప్తాను చూడండి, ఇప్పట్లో ఆయన స్వతంత్రంగా బ్రతకలేరు. అందువల్ల మీకు ధైర్యం ఉంటే పెళ్ళిని వాయిదా వెయ్యండి. ధైర్యం చాలకపోతే వెంటనే పెళ్ళి చేసుకోవడం మంచిదని నా ఉద్దేశ్యం. అయినా ఇలాంటి విషయాల్లో నాకూ అనుభవం తక్కువ. మీరే ఆలోచించుకోండి."

మళ్ళీ ఏడుస్తోంది వసుంధర. ఆమె ఏడిస్తే బావుండదు. దేశ రక్షణకు కంకణం కట్టుకున్న సైన్యాధిపతి శత్రువును చూడగానే భోరున ఏడిస్తే ఏమవుతుంది?

తరువాత అక్కడినుంచి వచ్చేశాను.

## 7

మళ్ళా వాళ్ళిద్దరూ ఏం మాట్లాడుకున్నారో ఏమో మరో రోజు ఉదయమే వామనరావు వచ్చి పెళ్ళికి సిద్ధపడ్డట్టు చెప్పాడు.

వెంటనే తనని పెళ్ళిచేసుకోమని వసుంధర కోరిందట. 'కోరింది' అనలేదు. 'ప్రాధేయపడింది' అంటాడు. 'నాకూ అదే ఇష్టం' అన్నాడు.

నేనింకేం మాట్లాడలేదు. 'ఎప్పుడో పెళ్ళి?' అన్నాను నిర్లిప్తంగా.

"ఒక్కటి రెండు ఏర్పాట్లు జరిగిపోతే మరి ఇరవై రోజుల్లో జరుపుకొందామని ఉంది" అన్నాడు.

కూచుని ఆలోచించాం -

ఒక్క విషయం ఇంతవరకు నేను చెప్పలేదనుకుంటాను.

మనస్సులు, స్వభావాలకు సంబంధించిన నవలల్లో కులాలు, ఉద్యోగాల ప్రసక్తి బాగుండదు. అనవసరం. సాంఘిక వ్యవస్థలో ఆ వ్యక్తి స్థాయిని చెప్పి ఊరుకుంటే చాలు. వ్యక్తి భౌతిక దారిద్ర్యం చెప్పే రచన అయితే అతని ఉద్యోగం మీదా, జీతం మీదా ఇంక్రిమెంట్ల మీదా కథను మెలికలు తిప్పవచ్చు. కానీ మానసికమైన దారిద్ర్యాన్ని, మానసికమైన సమస్యల్ని ఆసరా చేసుకున్నప్పుడు వెయ్యిరూపాయల జీతగాడూ, పదిరూపాయల కూలీ బ్రతుకన్నా ఈ విషయంలో ఒకటే. **కూతురు తప్పటడుగు వేస్తే, తల్లి దుఃఖం బికారి దుఃఖం ఒకటే. మొదటిది ఖరీదయిన దుఃఖం. ప్రపంచమంతా అతని తరపున ఏడుస్తుంది. రెండవది, బీద దుఃఖం. ప్రపంచం అంతటి తరపున ఇతను ఏడుస్తాడు.**

అట్లాగే కులాల ప్రసక్తి ఇప్పుడిక వామనరావు బ్రాహ్మణ కుటుంబానికి చెందినవాడని చెప్పాలి. వసుంధర ఆ కులం కాదంటే సరిపోతుంది. ఉరితీసుకుందుకి చిన్నవాడయినా, పెద్దవాడయినా ఫరవాలేదు. తీసుకునేది 'ఉరి' కనుక.

ఇద్దరూ పెళ్ళి చేసుకుంటున్న విషయం కొందరికి తప్పనిసరిగా తెలియాలి. తెలుస్తుంది. వసుంధర ఇంటి యజమాని, వామనరావు ఉంటున్న గది యజమాని, మిత్రులు, యూనివర్శిటీలో మిగతావాళ్ళ వ్యవహారాలు మీద ఆసక్తిని ప్రకటించే వ్యక్తులు - వీళ్ళకి తెలిసి తీరుతుంది.

కానీ పెళ్ళి ఎక్కడ జరగాలి? ఎవరు వస్తారు? పెళ్ళి అంటే 'స్పెల్లింగు' మాత్రం తెలిసిన నేనూ, వామనరావు ఆ విషయమై ఆలోచించాం. నామీద పూర్తి బాధ్యతలన్నీ పెట్టాడు. చేతనయినంతవరకు మోస్తానన్నాను. మొదట నా గదిలో జరిపితే బాగుణ్ణని ఆలోచన వచ్చింది. కానీ విషయం తెలిశాక ఇంటి యజమాని అంగీకరించలేదు. తరువాత వామనరావు గది యజమాని దగ్గరికి వెళ్ళాం. ఆయన డాక్టరు. చాలాసార్లు పంచవర్ష ప్రణాళికల గురించి, ఈగల సంహార వారోత్సవాల గురించి చాలాచోట్ల ఉపన్యాసాలిచ్చారు. మందుల ఖరీదుని, సలహాలు ఉచితంగా ఇవ్వడం అతనికి ఆనవాయితీ.

మేం అసలు విషయం చెప్పగానే వామనరావుని కావలించుకున్నారు పెద్ద రాజకీయనాయకుడులాగ. ఇంగ్లీషులో పదిరకాలుగా అతన్ని పొగుడుతూ, పారిస్‌లో ఉండగా ఇట్లాంటి వివాహాన్నే తానెంత పెద్దలతో జరిపిందీ వివరించి చెప్పాడు. వామనరావు మీదా, అతని చర్మమీదా సానుభూతి చూపే వ్యక్తి ఇంతకాలానికి కనిపించినందుకు ఇద్దరికీ సంతోషం కలిగించింది. మనవాళ్ళకి ఇంకా 'రివోల్టు' అర్థం తెలీదని, 'ఫారినర్స్' దగ్గర వీళ్ళకి తర్ఫీదు ఇవ్వాలని విచిత్రమయిన అర్థాలు వచ్చేలాగ తిట్టారు. తిట్టి తిట్టి వెనక్కి చేరబడి 'వెల్! పెళ్ళిచేసుకు ఏం చేస్తావోయ్ ఫ్రెండ్' అన్నారు వామనరావుని చూసి.

ఇంతవరకు విన్నాక అతనికి ఉత్సాహం వచ్చింది.

"ఏం చేస్తాను సార్? సుఖంగా బ్రతుకుతాం"

"సుఖం అంటే?"

ఇద్దరం బిత్తరపోయాం.

"కష్టం లేకపోవడం, లేదా కష్టం లేదనుకోవడం" తనే సమాధానం చెప్పుకున్నారు. 'పెళ్ళయ్యాక ఏం చేస్తావో నువ్వు సరిగ్గా చెప్పలేవు పిల్లల్ని కంటావు. అదీ చేసేపని. అవునా?"

నవ్వాడు వామనరావు.

"ఎన్నాళ్ళు బ్రతుకుదామని ఉంది నీకూ?" అనడిగాడు నల్లటి కళ్ళద్దాలకిందనుంచి చూస్తూ.

ఆయనేదో చెప్పబోతున్నాడని అర్థమయింది.

"వీలయితే నూరేళ్ళు వీలుకాకపోతే ఏక్షణాన్నయినా చచ్చిపోవడానికి ఎవరయినా సిద్ధం" అన్నాడు.

నవ్వారు డాక్టరుగారు. 'ఈలోగా ఈయనగారికి పిల్లలు పుడతారు. ఇతనికీ ఆ అమ్మాయికి పుట్టిన పిల్లలు ఏ వర్గానికి చెందుతారు? వాళ్ళని ఏమని పిలవాలి? నూరేళ్ళకి ఈయన చచ్చిపోతే - తన విప్లవానికి మురిసిపోతూ సుఖంగా చచ్చిపోతే - ఈయన విప్లవానికి బాధపడుతూ, తండ్రి తెలివితక్కువతనాన్ని తిట్టుకుంటూ మరి నూరేళ్ళు ఆ పిల్లలు బ్రతుకుతారు. నామీద కోపం తెచ్చుకోకండి మీ కంటే నేను ఒకతరం పెద్దవాణ్ణి. విప్లవం, త్యాగం, ప్రేమ ఇలాంటి పదాలు కథల్లో బాగుంటాయి. కానీ వాస్తవానికి లేవు. ప్రతిదానికి ఒక రీజన్ ఉంది. మన పూర్వులు వెధవలు కారు. అరవై ఏళ్ళు బ్రతికి, ఆరుదేశాలు తిరిగి, అరడజను మంది పిల్లల్ని కని, ఆరుకి తక్కువ కాకుండా ఇట్లాంటి పెళ్ళిళ్ళు చేయించి ఫెయిలయి నేను వచ్చిన నిర్ణయం ఇది. ఇట్లాంటి పెళ్ళిళ్ళు తప్పనను. కానీ వాటి పునాదుల్ని ఊహించడం మనవాళ్ళకి తెలీదు ఉద్రేకాన్ని పక్కకి పెట్టి, స్థైర్యంతో ఆలోచించిన తరువాత కూడా ఆ ఇద్దరి మధ్య సంబంధం, అభిమానం నిలబడగలిగేదనిపిస్తే పెళ్ళిచేసుకోమను. కాదనను. కానీ వెయ్యిమందిలో ఒక్క సంఘటన అలాంటిది కాదనదు. ఇన్‌షార్ట్ - ఇట్లాంటి పెళ్ళిళ్ళు ఈ దేశంలో జరగడానికి మరి పదితరాలు పెరగాలి, మనవాళ్ళు. ఇది నా అభిప్రాయం. ఇక మీకేం కావాలో చెప్పండి"

నేనూ, వామనరావూ బిక్కచచ్చిపోయాం. ఇంత ఆశాభంగం, ఆఘాతం అతనెప్పుడూ జీవితంతో అనుభవించి ఉండడు. నేనూ అంతే. దిమ్మెరపోయి అలా ప్రతిమలా కూచుండిపోయాం.

ఐసీ క్రీం తెప్పించారు డాక్టరుగారు. ఇక ఆయన ఇంట్లో పెళ్ళి ప్రసక్తి ఎట్లా కదపడం? నోరుమూసుక్కూర్చున్నాం. అయినా నోరు తెరవక పోయినా ఆయన పేగులు లెక్కపెట్టేరకం. లెక్కపెట్టేశాడు.

"ఈ పెళ్ళి నీ గదిలో జరపాలని అడగడానికి వచ్చారని తెలుసు నాకు. కానీ ఆయన ఇష్టపడితే ఎలాగూ మాట్లాడే అవకాశం పోతుంది. ఇంత చక్కటి ఉపన్యాసాన్ని ఈ చిన్న కారణంతో పాడుచేసుకోవడం ఇష్టంలేదు. అందుకని ఆ ప్రసక్తి లేదు. ఏమయినా నీకు నా కంగ్రాచ్యులేషన్స్"

లేచాం ఇద్దరం. ఆయన భావాలతో, భాషతో సూటిదనంతో ఉక్కిరిబిక్కిరయాం. మళ్ళీ మా నిర్ణయాన్ని ముందుంచుకుని పర్యాలోకించుకోవాలేమోనన్నంత కదిలిపోయాం.

గిరిధరరావు అనే ఓ మిత్రుడున్నాడు నాకు. యూనివర్శిటీ హాస్టల్లో ఉన్నాడు. ఇద్దరం అతని దగ్గరికి బయలుదేరాం. వామనరావుని పరిచయం చేసి, కథంతా చెప్పాక అతనికీ సానుభూతి ధైర్యం కలిగాయి, 'తప్పక మనమే పెళ్ళి చేసేద్దాం' అన్నాడు.

అప్పటి సమస్య చెప్పాను. 'ఎక్కడ?'

"అంత సమస్య ఎందుకు? ఈ గదిలోనే, ఇక్కడే చేసేద్దాం. ఓ పదిమంది మిత్రుల్ని పోగుచేసుకొస్తాను. చిన్న టీపార్టీ ఏర్పాటు చేద్దాం. ఒక్కరాత్రి ఈ హాస్టల్ ఆ దంపతులకు స్వర్గం అవుతుంది. దీని చరిత్రలో సువర్ణ ఘట్టం."

గిరిధరరావు, చాలా హుషారైన మనిషి. సన్నగా హాకీ బాటులాగా ఉంటాడు. శరీరం ఊపుకి నడుం కాస్త వంగిపోయింది. లేకపోతే అట్లా వంగినడవడం ఫాషన్‌గా భావిస్తాడేమో మరి. మనిషికి తొందర. ఏదన్నా ఆలోచన వస్తే దాన్ని ఒదిలేసి మంచి చెడ్డలు ఆలోచిస్తాడు.

అతని ధర్మమంటూ ఓ పెద్ద సమస్య తీరిపోయింది. రిజిస్ట్రార్ ఆఫీసులో మూడు రూపాయలు కట్టి వచ్చేశాడు వామనరావు. ఇక తేదీకోసం ఎదురుచూస్తూ గడపడం ప్రారంభించాడు.

ఈలోగా తన పరిస్థితిని, నిర్ణయాన్ని వివరిస్తూ వామనరావు తండ్రికి ఓ పదిపేజీల ఉత్తరం వ్రాశాడు. కొత్త బట్టలు కుట్టించాడు. పెళ్ళయాక ఉండడానికి ప్రస్తుతం వసుంధర ఉన్న ఇంటి యజమాని అంగీకరించాడు.

ప్రతిరోజూ సాయంకాలం ఇద్దర్నీ కలిసేవాడిని. సాధారణంగా వసుంధర ఇంటిలోనే ముగ్గురం కూచుని కబుర్లు సాగించేవాళ్ళం. భవిష్యత్తులో వాళ్ళిద్దరూ ఎట్లా బ్రతకాలో ఆలోచించేవాడు వామనరావు. ఈ చర్చలో నేనూ ఉండాలని పట్టుబట్టేవాడు. తప్పక కూచునేవాడిని. పెళ్ళికి నిర్ణయం జరిగాక ఎంతో ఉత్సాహంగా తయారయాడు వామనరావు. ఇక కష్టాలన్నీ తీరిపోయాయని సంతోషించాను. వసుంధర మనస్సులోనూ పెద్ద పీటముడి విడిపోయినట్టనిపించింది. ముఖం వికసించి, నవ్వుతూ పలకరించేది. మనిషి ఎప్పుడూ ముక్తసరిగా మాట్లాడేరకం. కానీ ఇన్నాళ్ళకి నామీద ఓ రకమైన విశ్వాసం, దగ్గరతనం ఏర్పడినట్టు కనిపించింది.

ఎన్నో గంటలు ఆ చర్చలలో, గడిచిపోయేది. నేనూ ఓ మంచిపని చెయ్యగలుగుతున్నందుకు చాలా సంతోషం కలిగేది.

## 8

ఉన్నట్టుండి వామనరావు మాయమయిపోయాడు.

నేను భయపడిపోయాను. ఏ ప్రమాదం నుంచి వసుంధరను రక్షించాలనుకున్నాడో ఆ ప్రమాదం ఆమెనుంచి ఎదురుచూస్తున్నట్టనిపించింది. ఎక్కడికిపోయాడో వామనరావు? ఎందుకు? ఇలాంటి ప్రశ్నలకి ఎంత ఆలోచించినా సమాధానాలు దొరకలేదు.

ఈ విషయ తెలిసీ తెలియగానే తొందరగా వసుంధరని చూడడానికి వెళ్ళాను. నన్ను చూసి నవ్వుతూ పలకరించింది. 'ఆయన కనిపించడం లేదటగా?' అనడిగింది.

ఆమె దుఃఖోపశమనానికి క్రమంగా మాటలు పేరుస్తున్నాను. కానీ ఆమె నన్ను ఓదార్చుతున్నట్టుంది. 'మరేం భయపడకండి. పిరికివాడిలో విప్లవం విచిత్రంగా ఉంటుంది. ఏదో చెయ్యబోయి, ఏమీ చెయ్యలేక వెనక్కివస్తారు. రేపో ఎల్లుండో ఆయన ఇక్కడ ఉంటారు. '

నేను ఆశ్చర్యపోయాను. 'వామనరావుగారు పిరికివాడని మీ ఉద్దేశమా?'

ఆమె నవ్వింది. 'అవును. నా ఉద్దేశం అదే కావలిస్తే దానికి మీరేదయినా అందమయిన పేరు పెట్టండి.'

తొందరపాటుతో, ఉత్సాహంతో మరొకప్రశ్న అసంకల్పితంగా అడిగేశాను. 'మరెందుకు పెళ్ళిచేసుకుంటున్నారతన్ని?'

ఆ ప్రశ్న దూకుడికి మొదట ఆమె నిర్ఘాంతపోయింది. ఆశ్చర్యపోతూ నా వేపు చూస్తూ ఉండిపోయింది. నేను క్షమాపణ చెప్పబోయేంతలో సమాధానం చెప్పింది.

"ధైర్యం ఒక్కటే మగవాడిలో ఆకర్షణయి కనిపించే గుణంకాదు. అడిగారు గనక చెపుతున్నాను. మగవాడి బలహీనతల్ని స్త్రీ ప్రేమించినట్టు గొప్పగుణాల్ని ప్రేమించలేదు"

నేను తెల్లబోయాను. వసుంధర కొన్ని సంవత్సరాలు ఈ మనిషిని తరిచి, పరిశీలించి, తర్జన భర్జనలు జరుపుకొని వచ్చిన నిర్ణయంలాగా కనిపించింది. ఇది ఒక్క క్షణంలో తటాలున బయటపడిన వాక్యం కాదు. ఆ ప్రశ్న అడిగినందుకు తరువాత నాకు నేనే అభినందనలు చెప్పుకున్నాను. ఆమె సమాధానం విన్నాక అందరికన్నా వామనరావే స్త్రీ ప్రేమకు అర్హుడనిపించింది.

ప్రపంచంలో మహాత్మా గాంధీ, అబ్రహాంలింకన్ కన్నా కానల్ చెస్‌మన్, ఈక్‌మన్ అంటే సానుభూతి చూపే స్త్రీలు ఎక్కువ ఉంటారేమో. వీళ్ళు దేశం కోసం చచ్చిపోయారు. వాళ్ళు తమకోసమే తాము మరణించారు. స్త్రీకి దేశం, ప్రపంచం కాదు.. వ్యక్తి ముఖ్యం. వసుంధర దృక్పథం సహాయంతో ఇంతవరకు ఆలోచించాను. తరువాత ఆలోచించడానికే భయమేసింది. ఇట్లాంటి కారణాలవల్లే ఒక్క స్త్రీ భారతయుద్ధానికి కారణమయింది. ఒక్క స్త్రీ ఫ్రాన్సుని యుద్ధకాలంలో గజగజలాడించింది.

ఏమైనా నేననుకున్నంత కృంగిపోలేదు వసుంధర. ప్రతిరోజూ కలిసినా 'ఆయన గురించి ఏమన్నా తెలిసిందా?' అని మాత్రం అడిగేది. ఈ ఒంటరి రోజుల్లో మేమిద్దరం మంచి స్నేహితులమయాం.

వసుంధరకి శరీరంకాదు మనస్సు చాలా అందమయిందని ఈ వ్యవధిలో అర్థమయింది.

ఒకవేళ వామనరావు తిరిగి రాకపోతే? – ఈ ప్రశ్న జ్ఞాపకం వచ్చినప్పుడల్లా నన్ను వేధిస్తుండేది. ఆమెతో అంటే నవ్వి ఊరుకునేది.

జీవితానికి గమ్యమేదో స్త్రీకి తెలిసినంత రూఢిగా పురుషుడికి తెలియదేమోననిపిస్తుంది. ఈ జీవితం ముగింపు మృత్యువు అనుకుంటుంది స్త్రీ. స్వర్గం అనుకుంటాడు పురుషుడు. అందువల్లనే ప్రతి విషయాన్నీ ఓర్పుతో, మందహాసంతో గ్రహించే నేర్పు స్త్రీకి, అసంతృప్తితో, ఆకలితో కబళించే ప్రలోభం పురుషుడికీ అలవడి ఉంటుంది.

ఏమయినా వసుంధర చెప్పింది నిజమే. ఆరురోజులు తరువాత వామనరావు మళ్ళా ప్రత్యక్షమయ్యాడు. వసుంధర నవ్వుకుంది. నేను నిశ్చేష్టుడనయాను. మరీ సన్నగిలి, ఏదో కట్టెపుల్ల గాలిలో నిలబడినట్టుగా కనిపించాడు వామనరావు.

"వామనరావుగారూ! ఎక్కడికిపోయారు?" అన్నాను ఆతృతగా.

ఇదివరకు నవ్వేవాడన్నానే ఆ నవ్వుకూడా మరిచిపోయాడిప్పుడు. మామూలుగా మాట్లాడటానికే వణికిపోతున్నాడు.

ఇద్దరం ఒంటరిగా మిగిలాక ప్రారంభించాడు. "ఎవరితో ఈ విషయం చెప్పరుకదా!"

ఆతృతకి అంత బలం ఉందని నాకంతవరకూ తెలీదు. నా పేగులు తెగిపోతున్నాయి.

"చెప్పండి, చెప్పండి"

"నేను నెల్లూరు వెళ్ళి వచ్చాను."

"ఎందుకు?"

**వారం రోజుల క్రిందట** రాత్రి కొద్దిగా రక్తం పడింది నోట్లోనుంచి భయమేసింది నాకు, వెంటనే డాక్టరుగారి దగ్గరకి వెళ్ళాను. ఆయన పరిక్ష చేసి అనుమానం తీరాక వెంటనే ఓసారి నెల్లూరు వెళ్ళిరా అన్నాడు. వెళ్ళి వచ్చాను.

"ఏమయింది? ఏం చెప్పారు డాక్టర్లు?"

ఇప్పుడు మళ్ళా నవ్వుతున్నాడు. "ఇంత దిట్టమయిన పరిక్ష జీవితంలో ఎవడికయినా ఎదురవుతుందంటారా? నాకు టి.బి ఉందట, ఇదివరకు కొద్దిగా అమ్మ చచ్చిపోయిన దగ్గర్నుంచీ పెరుగుతోంది."

తల మీద పిడుగుపడ్డట్టయింది నాకు. ఇంకేం మాట్లాడలేదు నేను. అతనే చెపుతున్నాడు.

"మొదట ఇక్కడికి తిరిగి రాకూడదనుకున్నాను. కానీ వసుంధర బాధపడుతుందని – మీరు నొచ్చుకుంటారనీ. ఇప్పుడేం చెయ్యాలో చెప్పండి. ఈ విషయం వసుంధరకి చెప్పాలా? వద్దా?"

ఆ రాత్రి ఇక మా ఇద్దరికీ నిద్రలేదు.

"మీ నాన్నగారి దగ్గర్నుంచి ఉత్తరం ఏమన్నా వచ్చిందా?"

"లేదు."

ఆలోచించాం. ఆ విషయం విన్నాక వసుంధర మనస్సు పోయే పోకడలను వెయ్యి రకాలుగా ఊహించాం. చివరికి అన్నాను. "వామనరావుగారూ! ఏమయినాసరే, ఆమెకి మొదట ఈ విషయం చెప్పడం మంచిది. దానికి తట్టుకోగలదనే నా నమ్మకం. ఆమెకి తెలిశాక ముగ్గురం కలిసి ఏం చెయ్యాలో ఆలోచిద్దాం."

ఆ మాట వామనరావుకి నచ్చింది. ఇద్దరం లేచాం. అప్పటికి రాత్రి మూడవుతుంది. వెళ్ళి వసుంధరని లేపాం. అంతా విన్నాక ఒక్క క్షణం తెల్లబోయి, ఏడవడం ప్రారంభించింది. తరువాత రెండుగంటలసేపు వామనరావు ఆమెను ఓదారుస్తూ కూచున్నాడు. నేను బయటికి వెళ్ళి పందిరి కింద చీకట్లో కూచున్నాను.

కొంతసేపటికి అతను పిలిస్తే లోకంలోకి వచ్చాను. వామనరావుకి చేరబడి కూచుని ఉంది. ఈ వార్త ఆమె మీద ఎంత దెబ్బతీసిందో ముఖాన్ని చూసి గుర్తించగలిగాను. అంత నిబ్బరం, స్థైర్యంగల మనిషి కూడా ఈ వార్తతో చెదిరిపోయింది.

నన్ను చాలా దయతో పలకరించింది. "ఆయన్ని కూడా మన సమస్యలతో కష్టపెడుతున్నాం" అంది వామనరావుతో.

అంతవరకు నా కష్టాన్ని నేను ఆలోచించలేదు. అప్పుడాలోచిస్తే నిజంగా నేనూ కష్టపడుతున్నాననిపించింది.

వామనరావు కళ్ళలోకూడా ఆ క్షణాన నీరు నిలిచి ఉండడం చూశాక ఆలోచనలన్నీ మళ్ళా చెదిరిపోయాయి.

ముగ్గురం మరి మూడుగంటలు ఆ గదిలోనే ఆలోచనల్ని పోగుచేసి తూర్పున తెల్లవారేసరికి ఓ నిశ్చయానికి వచ్చాం.

ఏమయినాసరే, పెళ్ళి ఆగడానికి వీలులేదు. వసుంధరకీ నాకూ తప్ప, వామనరావు అనారోగ్యం విషయం ఎవ్వరికీ తెలియకూడదు. పెళ్ళయాక అప్పుడిక ఏం చెయ్యాలో ఆలోచించవచ్చు. వసుంధర, వామనరావూ అందుకు అంగీకరించారు.

కానీ రాత్రి ఆలోచనల్తో, ప్రయాణపు బడలికతో ఆ రాత్రంతా నిద్రలేకపోవడం వల్ల మర్నాడంతా వామనరావుకి వళ్ళు తెలియకుండా జ్వరం వచ్చింది.

## 9

అయినా ఇక పెళ్ళి ఆగలేదు.

మూడోరోజు వామనరావు కొద్దిగా తేరుకున్నాక, సాయంకాలం ముగ్గురం కలిసి యూనివర్శిటీ హాస్టల్‌కి వచ్చాం. గిరిధరరావు మొదట అనుకున్నట్టు అన్ని ఏర్పాట్లూ చేశాడు. అక్కడినుంచి రిజిస్ట్రారు ఆఫీసుకు వెళ్ళబోతుండగా ఓ టెలిగ్రాం వచ్చింది - వామనరావు నాన్నగారి దగ్గర్నించి

ఇంకా అతను నీరసంగానే ఉన్నాడు. నేనే తీసుకుని చదివాను. రెండే వాక్యాలున్నాయి అందులో. 'వీలయితే పెళ్ళిని కొంతకాలం వాయిదా వెయ్యి - నీ మిత్రుడు - తండ్రి' ఇదీ టెలిగ్రాం. వామనరావు నవ్వాడో, దుఃఖపడ్డాడో ఆ దిగులు ముఖంలో స్పష్టంగా తెలియలేదు గాని కన్నీళ్ళు తిరిగినట్టు గుర్తు. అయినా ఆగలేదు. 'పదండి ఆలస్యం అయిపోతుంది' అన్నాడు.

రిజిస్ట్రారు ఆఫీసులో పని ఒక గంటలో పూర్తయింది. గిరిధరరావు, నా సాక్ష్యంతో, అధికారముద్రతో వాళ్ళిద్దరూ దంపతులయిపోయారు.

ఆ కాగితం మీద సంతకాన్ని మనస్ఫూర్తిగా చేశాడు వామనరావు. వసుంధర ఇది జరుగుతున్నంతసేపూ ఏమీ మాట్లాడలేదు. తరువాతా మాట్లాడలేదు. ఆ సాయంకాలం కనీసం పదిసార్లయినా వామనరావు తన తల్లిని తలుచుకుని ఉంటాడు. నాలుగయిదుసార్లు నాతోనే అన్నాడు. 'ఈ పెళ్ళి గుర్తుకొచ్చినప్పుడల్లా అమ్మ గుర్తొస్తుంది. ఆ సుఖానికి చాలా పెద్ద అదృష్టాన్ని ఖర్చుచేశాను నేను' అని.

ఆరోజు యూనివర్శిటీ హాస్టల్ మూలగది వామనరావు దంపతులకి స్వాగతం చెప్పింది. అక్కడ పోగయిన విద్యార్థులంతా అరమరికలు లేకుండా నిండు హృదయాలతో వాళ్ళకి శుభాకాంక్షలు పలికారు. ఇంకా జీవితంలో ఒడుదుడుకులు తెలియని వాళ్ళ ఇరవై ఏళ్ళ మనస్సులకి వామనరావు, వసుంధర గొప్ప విప్లవకారులుగా కనిపించారు.

గిరిధరరావు గదిలో రెండు రంగుదీపాలు అమర్చాడు. పెళ్ళి తతంగం ముగిశాక మళ్ళా వామనరావుకి కొద్దిగా జ్వరం తగిలింది. ఆ గదిలో వామనరావు భార్య వసుంధర, భర్తకు సేవచేస్తూ మొదటి రాత్రి గడిపింది.

నేను ఇంటికి వచ్చి బరువుగా ఊపిరి పీల్చుకున్నాను. ఈ పెళ్ళివల్ల ముందు ముందు మంచి జరుగనున్నదో, చెడు జరుగబోతున్నదో తెలియదు - ఒక్క వామనరావు తండ్రికి తప్ప. ఆ దంపతుల్ని ఆశీర్వదించడానికి భగవంతుడికి మనస్సులోనే నమస్కారాలర్పించాను.

ఆరాత్రి రెండు పొడిచినుకులు పడ్డాయి. తెల్లవారేసరికి చిక్కటి ఎండ ప్రపంచంమీద వెండి రేకు పరిచినట్టు మెరిసింది.

## *10*

తెలుగు నవలల ప్రకారం ఇక కథానాయకుడు సుఖంగా బ్రతకాలికదా? కానీ వామనరావు అలా బ్రతకలేకపోయాడు. అందుకనే కథ రుచి ‘చేదు‘ అయిపోయింది.

కొందరికి వివాహం ముందు సమస్యలుంటే కొందరి వివాహంతో సమస్యలు ప్రారంభిస్తాయి. ఆంధ్రదేశపు జీవితాలు సాధారణంగా రెండవ వర్గానివి. కానీ ఆంధ్రదేశపు నవలలు, కథలూ మొదటి వర్గానికి చెందినవి. ఇప్పటి సాహిత్యం, సినీమాలూ, నాటకాలూ, వగైరాలన్నీ చచ్చుగా ఉండడానికి పెద్ద, ముఖ్యమైన కారణం ఇదొక్కటే.

కానీ వామనరావుకి వివాహానికి ముందూ తరువాతా సమస్యలే మిగిలాయి. అదే దురదృష్టం.

అసలు ఇంతవరకు కథని ఇంకా చాలా క్లుప్తంగా చెప్పవచ్చు. చెబితే బాగుంటుంది. కానీ కథకి మంచి పునాదులు ఈ ప్రాతిపదికలోనే ఉన్నాయి. రావణుడు గొప్ప శివభక్తుడని చెప్పాక, అతని తరువాత వాలి దుశ్చర్యకు బలం వస్తుంది; టెక్నిక్‌లో ఉన్న మెలుకువలు వాల్మీకి నుంచి ఇప్పటివరకూ ఒకటే.

ఇక్కడనుంచి వామనరావు సుఖంగా బ్రతికితే నేనీ నవల వ్రాయనక్కరలేదు. ***నవలకు సాధారణంగా సంతోషం దుఃఖం, తృప్తీ - ఇట్లాంటివి ఇతివృత్తాలు కాలేవు. దుఃఖం, బాధ, పగ - లేదా సుఖానికి ప్రయత్నం, సంతోషానికి తాపత్రయం - ఇక ప్రపంచంలోని సంఘటనలన్నీను. ఇదే ఇతివృత్తాలు.***

పెళ్ళి తరువాత వెంటనే వామనరావుకి ఎదురయిన సమస్య - చదువు.

ఉద్యోగం చేస్తానంటాడు అతను. కానీ చదవమని వసుంధర ప్రోత్సాహం. పెళ్ళయాక ప్రతినెలా తండ్రి దగ్గర్నుంచి వచ్చే డబ్బు నిలిచిపోయింది. ఇప్పుడు ఇద్దరూ ఒక గదికి చేరారు. ఆ చీకటి ఇరుకు గదిలో వారి దాంపత్యజీవితం ప్రారంభమయింది.

డిగ్రీ చదువు మధ్యలో వదిలివేయడం వసుంధరకి ఇష్టంలేదు. కానీ చదువుకి డబ్బు ఎలా? ఇదీ వామనరావు సమస్య ‘నేను ఉద్యోగం చేస్తున్నాను కదా? మనకేం కష్టం‘ అంది ఆమె. ఇప్పట్లో అతను చదువు పూర్తిచేయడమే మంచిదని నాకూ తోచింది. ఆమాటే అతనితో చెప్పాను. అతనికింకా సంశయం తీరలేదు. ఆమెకి దాదాపు 130 వరకూ జీతం వస్తుంది. కానీ ఆమె డబ్బుతో చదవడం ఎలా అన్న సమస్య అతన్ని వేధిస్తున్నదని అర్ధమయింది నాకు.

అందర్నీ ఎదిరించి వివాహానికి సిద్ధపడిన మనస్సు, స్త్రీ డబ్బుతో బ్రతకడానికి రాజీపడడంలేదు. ఏమైనా సరే చదవనన్నాడు వామనరావు. ఇక వసుంధర చెప్పలేకపోయింది.

నేను అలసిపోయాను. మొత్తం మీద జీవితం ఒడుదుడుకులు లేకుండా సాగిపోవడం ప్రారంభించింది. నేనూ సంతోషించాను. వామనరావు జీవితం ఒకదారి పట్టినందుకు.

వాల్తేరులో నా చదువు పూర్తయాక పైచదువుకి మద్రాసు బయలుదేరవలసి వచ్చింది. ఓ పక్క పైచదువుకి వెళ్తున్న ఉత్సాహం ఉన్నా ఈ అయిదు నెలల్లో వామనరావు స్నేహం నన్ను మరీ కట్టిపడేయడంవల్ల కాస్త బాధకలిగింది. వామనరావు నిజంగానే కళ్ళనీళ్ళు పెట్టుకున్నాడు. పెళ్ళయాక చాలాసార్లు వాళ్ళిద్దరితో కలిసి భోజనం చేశాను. ముగ్గురం కలిసి ఎన్నో సాయంకాలాలు షికార్లు తిరిగాం. అప్పుడప్పుడు పక్క ఊర్లకు పిక్‌నిక్‌లు కూడాపోయి వచ్చేవాళ్ళం. వెళ్ళిపోతున్న రోజున ఇద్దరూ స్టేషన్‌కు వచ్చారు.

"మమ్మల్ని మరిచిపోకండి. ఉత్తరాలు వ్రాస్తూండండి" అన్నది వసుంధర.

వామనరావు చిన్నపిల్లాడిలాగ బిక్క మొహం వేశాడు. ఇంతస్వల్పవ్యవధిలో ఇంత సాన్నిహిత్యం ఎలా ఏర్పడిందా అని నాకే ఆశ్చర్యం కలిగింది.

"ఈ పదిహేను నెలలూ కాదు. ఇక ముందు ఎలా బ్రతకగలనా అని బెంగగా ఉంది. ఇంతవరకు ఏం కష్టం వచ్చినా మీమీదకి సగం తోసేసేవాడిని. ఎప్పుడు తీరుబాటు దొరికినా ఇక్కడికి వచ్చేస్తుండండి" అన్నాడు వామనరావు.

అతని రెండు చేతులూ పట్టుకున్నాను "విశాఖపట్నం వచ్చి మంచి డిగ్రీ, మంచి స్నేహితుల్ని సంపాదించుకున్నాను. మిమ్మల్ని నా జీవితంలో మరిచిపోలేను" అన్నాను.

## 11

మళ్ళా సంవత్సరం వరకు విశాఖపట్నం వెళ్ళడం సాధ్యపడలేదు.

ఈలోగా చాలా మార్పులు జరిగిపోయాయి నాకూ పెళ్ళి జరిగిపోయింది. ప్రతివ్యక్తీ ఎదురుచూడకపోయినా లోనయే పెద్ద మార్పనుకుంటాను. మగవాడు ఈ మార్పు పట్ల విముఖతను ప్రకటిస్తూనే ఎదురుచూస్తుంటాడు. స్త్రీ ఆ మార్పుకి సుముఖంగా ఉన్నట్టు కనిపిస్తూనే లోలోపల భయపడుతూంటుంది. మొత్తం మీద ఇద్దరికీ చిక్కుప్రశ్న వివాహమే. ఆ ప్రశ్నకి ఒక్కొక్కరికి ఒక్కొక్క సమాధానం వచ్చింది. వస్తోంది. అందుకనే ఆ సమస్య అందంగా, తియ్యగా, గొప్పగా మిగిలిపోతోంది. ప్రతివ్యక్తి జీవితంలో సాంఘిక వ్యవస్థలో.

పెళ్ళి చాలా మార్చింది నన్ను. అభిరుచులకీ, ప్రేమకీ, వాస్తవానికి - 'ప్రేమ' అంత చెత్తపదం మరొకటి లేదు. మరి రాధాకృష్ణుల మధ్య భావమో, మీరాలోని అనుభూతో అని ప్రశ్నించవచ్చు. అది 'ప్రేమ' కాదు - ప్రేమే అయితే ఇప్పటి రెండక్షరాలు కాదు. అంతకన్న గొప్పది మరేదో. ***20 శతాబ్దపు రచనల్లో, నవలల్లో, నాటకాలలో, మనుషుల మధ్య నలిగి చచ్చిపోయింది ఈ ప్రేమ.***

***నిజంగా ప్రేమ అనే భావానికి అర్థం ఆసక్తితో నిండిన కళ్ళతో జీవితాంతం చూస్తూ గడిపే కుక్కకి మాత్రమే తెలుసుననుకుంటాను.***

పెళ్ళి నాకేం ఆశాభంగం కలిగించలేదు. వామనరావు ఇలాగని రాస్తే నవ్వాడు. 'మిమ్మల్ని వివాహం ఎలా మార్చిందో వ్రాయండి వింటాను' అన్నాడు.

చాలా మార్చింది నన్ను. దారీ తెన్నూలేని వింతలోకాలు, ఊపిరితిప్పుకోనివ్వని ఆవేశం దారులు వెదుక్కున్నాయి. ఒక సమన్వయం, సంయమనం అలవాటయింది. ప్రపంచాన్ని ప్రశ్నించే ధీమా పోయి ప్రతి అక్రమం మీదా, ప్రతి సమస్యమీదా ఒక సానుభూతితో కూడిన దృష్టి ఏర్పడింది. రెండోసారి ఆలోచించే ఓర్పు వస్తుంది. మనిషిలో ఇది ఎంతమార్పు.

వేసవిసెలవుల్లో (చదువు పూర్తిచేసుకున్నాక) విశాఖ వచ్చి వామనరావుతో పదిరోజులు గడిపాను. అప్పటికే వామనరావులో చాలా మార్పు వచ్చింది. వివాహమైన కొద్దికాలంలోనే నెలలు నిండకుండానే వసుంధరకి కూతురుపుట్టి చచ్చిపోయింది. ఆమెకి వెంటనే జబ్బు చేసింది. మళ్ళా ఎట్లాగో మృత్యుముఖం నుంచి బయట పడిందని వామనరావు వ్రాశాడు. అప్పట్లో అతని ఉద్యోగమల్లా ఆమెను

ఆసుపత్రిలో చేర్చడం, అక్కడికి రెండు పూటలా కేరేజి తీసుకువెళ్ళడం, తరువాత వసుంధరకి జీతం పెరిగింది. నూట అరవై ఇస్తున్నారని వ్రాశాడు. మళ్ళా ఉద్యోగాన్వేషణ ప్రారంభించారట. ఈ కాలంలో ఎవరయినా పిల్లనిస్తాడేమోగాని, ఉద్యోగాన్నివ్వడానికి సిద్ధంగా లేడన్నాడు. కాస్త హాస్యం అలవడినట్టుందని సంతోషించాను - తరువాత ఆరునెలల ఉత్తరాలలో ఒకటే విషయం - ఉద్యోగం. 'వైజాగ్‌లో ఆఫీసుల పేర్లన్నీ కంఠోపాఠం వచ్చు. మేనేజర్ల ఫోను నెంబర్లు చెప్పగల్ను. రోడ్ల చిరునామాలు సరేసరి. నిరుద్యోగుల సంఘం స్థాపిస్తే నేను అధ్యక్షుణ్ణి' అని వ్రాశాడు ఓసారి.

కానీ ఎందులోనూ వసుంధర విషయం ఎప్పుడూ వ్రాయడేం? మానవప్రవృత్తిలో ఉన్న విచిత్రమేమో ఇది. సుఖాన్ని త్వరగా మరచిపోయినట్టు దుఃఖం మరుపుకు రాదు. ఎప్పుడూ సుఖాన్నే ఇస్తే దేవుణ్ణి మరిచిపోతాం. తృప్తిని కలిగించే భార్య, మనశ్శాంతినిచ్చే కాపరాన్ని మరచిపోయి మిగతా విశేషాలన్నీ వ్రాస్తున్నాడు కాబోలునని సరిపెట్టుకున్నాను.

నా ప్రయత్నం, అతని వివాహానికి నా దోహదం ఊరికే పోనందుకు చాలా సంతోషం కలిగింది.

ఉన్నట్టుండి - మార్చినెలలో కాబోలు - నన్నోసారి వైజాగ్ వచ్చివెళ్ళమని వ్రాశాడు. కానీ పరిక్షలు, కదలడానికి వీలులేకపోయింది. తరువాత రెండుమూడు ఉత్తరాలు వచ్చాయి. ఇక పరీక్షలు కాగానే వేసవి సెలవుల్లో బయలుదేరాను.

ఒక పెద్ద ప్రయోగాన్ని చేశాక దాని ఫలితాన్ని చూడడానికి విద్యార్థిలో కనిపించే ఉత్సుకత నాకు కలిగింది. అప్పుడే పదకొండు నెలలు దాటింది వామనరావుని చూసి. స్టేషన్‌లో నన్ను చూడగానే ఒక్కసారిగా కావలించుకున్నాడు. సంతోషంతో ఉప్పొంగిపోయాడు. ఆతృతగా అతని ముఖాన్ని వెదికాను. ఇదివరకటికంటే మనిషి చాలానయం. ఇప్పుడు గుప్పిటిలో దొరుకుతాడు.

"వామనరావుగారూ! ఎలావుంది మీ ఆరోగ్యం?"

నవ్వాడు, "నేను క్షయని మరచిపోయాను. క్షయ నన్ను మరిచిపోయింది. ఇప్పుడేం లేదు" అన్నాడు.

ఏవేవో మాట్లాడాను. ఈ పదకొండు నెలలో వైజాగ్‌లోని వార్తలన్నీ ఒక్క గుక్కలో చెబుతున్నాడు. పోర్టుని విశాలం చేస్తున్నారు. విమానాశ్రయాన్ని తాత్కాలికంగా బంద్ చేశారు. యూనివర్శిటీలో కొత్త కొత్త బిల్డింగులు వెలిశాయి. సముద్రం ఇదివరకటి కన్నా ముందుకు వచ్చింది. లైట్ హౌస్ కట్టడంతో 'డాల్ఫిన్స్‌నోస్' ముక్కు చివర విరిగిపోయింది. ఇప్పుడది 'డాల్ఫిన్స్‌నోస్' కాదు 'మౌత్' అనవచ్చునంటాడు. ఇలా ఏవేవో చెపుతున్నాడు.

కానీ - ఎంతకి తనగురించి మాట్లాడడేం? వసుంధర గురించి చెప్పడేం?

కాస్త విరామం ఇచ్చాక వామనరావుని అవే ప్రశ్నలు అడిగాను. ఆ రెండు ప్రశ్నల్ని దాచడానికే ఇంత మాట్లాడుతున్నాడని అర్థమయింది. అవి అడిగాక దాదాపు అరగంట నిశ్శబ్దంగా ఉండిపోయాడు. ఎందుకని పలకరించాను మళ్ళీ -

"మీ ఇద్దరూ సుఖంగా ఉంటున్నారా వామనరావుగారూ?"

మాట్లాడడు.

"వసుంధర ఆరోగ్యం బాగుంటుందా?"

సమాధానం చెప్పడు.

కాస్సేపటికి నోరుకదిపి "అవన్నీ తర్వాత చెప్తాలెండి" అన్నాడు.

ఇల్లు మార్చారు. మరి రెండు గదులున్న ఓ పెద్ద ఇంటికి వచ్చారు. గదులకి కర్టెనులు, కిటికీలో ఓ చిన్న పూలకుండీ ఓ మూలకి వామనరావు. తల్లిఫోటో ఉన్నాయి.

ఇల్లంతా నిశ్శబ్దంగా ఉంది. "వసుంధర వచ్చేవేళయింది" అన్నాడు.

"ఆమె వచ్చేలోగా మీరెట్లా ఉంటున్నారో చెప్పండి" అన్నాను.

"మొదట కాఫీ చేసివస్తాను. నాకిప్పుడు బాగా కాఫీ చేయడం వచ్చు. వంటవండడం కూడా అంత కష్టంకాదు" నేను ఆశ్చర్యపోతే నవ్వాడు.

"బి.ఎస్సీ ఆనర్స్ ఇంకో సంవత్సరం ఉండిపోయింది. అదీ పూర్తయితే ఆ డిగ్రీతోపాటు వంట డిగ్రీ ఉండేది" అన్నాను నవ్వుతూ.

ఇదివరకటి వామనరావుకి ఇప్పుడు వామనరావుకి ఓ పెద్ద తేడా ఉంది. ఇదివరకు ప్రతివిషయాన్ని దుఃఖంగా మార్చుకునేవాడు. ఇప్పుడు ప్రతి దుఃఖాన్నీ సుఖానికి మార్చుకుంటున్నాడు.

"ఈ రహస్యాన్ని ఎలా కనిపెట్టారు?" అనడిగాను.

"ఏది?"

"ప్రతి విషయాన్నీ సులువుగా తీసుకోవడం, వీలయినంతవరకు దుఃఖాన్ని దూరంగా ఉంచడం."

"చాలా సింపుల్. ఏడాదిపాటు నిరుద్యోగిగా ఉండి భార్య డబ్బుతో బ్రతికితే మొదట సిగ్గుపోతుంది, తరువాత భయం పోతుంది. తరువాత వ్యక్తిత్వం, అహంకారం అన్నీ పోయి - ఆఖరికి 'వామనరావు' లాంటి ఓ జడపదార్థం మిగులుతుంది" కాఫీ ఇచ్చాడు. నిజంగానే చాలాబాగుంది కాఫీ. కానీ అతని వాక్యాలు గుండెల్లోకి దూసుకుపోయాయి. "అంత కష్టపడ్డారు ఈ పదకొండు నెలల్లో" అన్నాను.

ఇద్దరం కూచున్నాం, చెప్పడం ప్రారంభించాడు వామనరావు. "ఇంకా వసుంధర రావడానికో అరగంట వ్యవధి ఉంది. ఈలోగా క్లుప్తంగా నా కథ చెప్తాను ఇది చెప్పడానికి ఎవరూ కనిపించక మీకు పది ఉత్తరాలు వ్రాశాను. ఉద్యోగం దొరక్క పెళ్ళయిన కొత్తలో నాకు నేనే కృంగిపోయేవాడిని. నాన్నగారి దగ్గర్నుంచి డబ్బు రావడం నిలిచిపోయింది. ఇక ప్రతి చిన్నవిషయానికి, ప్రతిఖర్చుకి ఆమెను అడగడం తప్పేదికాదు. మొదట్లో నాకు కావలసినంతా ఆమె స్వయంగా అడిగి ఇచ్చేది. కానీ ఎప్పుడన్నా అడగవలసివస్తే నరకం అనుభవించేవాడిని. కాఫీ తాగాలంటే, బస్సులో ఎక్కాలంటే, ఉద్యోగానికి అప్లికేషన్ పెట్టాలంటే, తలనొప్పి వస్తే - అన్నిటికీ ఆమెను అడగాలి. అన్నీ ఆమెకి తెలియాలి. పాపం, దేనికీ అభ్యంతరం చెప్పేది కాదు కానీ ఇట్లాగడపడం తలకొట్టేసినట్టుండేది. ఉద్యోగాలు దొరకలేదు. కాళ్ళు అరిగిపోయేటట్టు ఊరంతా తిరిగాను. పక్క ఊళ్ళోకి కూడా వెళ్ళాను. డిగ్రీ పూర్తికాకపోవడం ఒక అనర్థం. మెల్లగా ఇంటిలో ఏదన్నా పనికి వెంట వెంటనే ఆదుకునేవాణ్ణి. బజారుకు వెళ్ళి ఆమెకి ఏమన్నా కావలిసివస్తే తెచ్చేవాడిని. ఉదయాన్నే హోటలుకి బయలుదేరితే ఆ చేత్తోనే ఫ్లాస్కు తీసుకుపోయి ఆమెకి కాఫీ తెచ్చేవాడిని. మధ్యాహ్నం మరీ అవసరమయితే ఆఫీసుకు వెళ్ళి ఆమెకు టిఫిన్ ఇచ్చి రావడంకద్దు. సినిమాకు వెళ్ళాలంటే ఉదయం వెళ్ళి టిక్కెట్లు తీసుకుని, ఆఫీసు వదిలేవరకు అక్కడే ఉండేవాడిని. ఆఫీసుకు వెళ్ళడం ఆలస్యమయితే తొందరగా వెళ్ళి రిక్షా తీసుకురావడం, చివరకి జోళ్ళు కుట్టించేపనికూడా చేసేవాడిని" నవ్వుకున్నాడు.

నేను నిర్ఘాంతపోయాను. "వామనరావుగారూ ఇదంతా నిజమేనా?" అన్నాను ఊపిరి తిరగక.

"అక్షరాలా నిజం. మొదట్లో ఏమీ తోచక, నా తీరిక సమయాన్ని ఏం చెయ్యాలో తెలీక, ఆమెకు సహాయం చెయ్యాలనే ఆత్రుతతో, ఆమెను సంతోషపెట్టాలనే ప్రలోభంతో చేసేవాడిని. క్రమంగా నాకు అలవాటయిపోయాయి. క్రమంగా వసుంధరకూ అలవాటయాయి. జోడు పాడయితే నేను కుట్టిస్తానని తెలుసు. ఆఫీసుకు ఆలస్యమయితే రిక్షా సిద్ధంగా ఉంటుందని తెలుసు, ఆఫీసునుంచి ఇంటికి వచ్చేసరికి, కాఫీ సిద్ధంగా ఉంటుందని తెలుసు. ఇవి ఎప్పుడన్నా ఆలస్యమయినా, జరగకపోయినా మొదట ఆశ్చర్యపోయేది, తరువాత గుర్తుచేసేది. క్రమంగా విసుక్కునేది. ఇక నాకు ఉద్యోగం వెదుక్కోవడానికి తీరిక లేకుండా పోయింది. ఇంటిదగ్గర పనుల్తో రోజంతా గడిచిపోయేది. కాఫీ బాగోలేకపోతే విసుక్కొంటుంది. ఆ రోజు ఆమె కోపానికి నేనెల్లా దగ్ధమయిపోతానో

మీకు తెలీదు. ఆమె ఆఫీసుకు వెళ్ళాక కాస్త తీరిక. అప్పుడు మీకు ఉత్తరాలు వ్రాస్తాను. పాత జీవితాన్ని గురించి ఆలోచిస్తాను. మీరువస్తే బాగుణ్ణని కలలుగంటాను. కానీ ఆమెకు మళ్ళీ టిఫిన్ వేళయితే పరిగెత్తాలి. లేకపోతే ఆమెకి కోపం. ఓసారి టిఫిన్ బాగోలేదని కాలువలో పోసొచ్చింది విసుక్కుంటూ 'మంచి బ్రతుకును ఇచ్చాననన్న కృతజ్ఞతన్నా లేదు' అని తిట్టుకుంది. ఇన్ని విన్నాక, ఇన్ని చూశాక నవ్వు అలవాటయింది. ఈ నవ్వుకు సంవత్సరం చరిత్ర, తర్ఫీదు ఉంది ఇక నన్ను కమ్చీతో కొట్టండి ఏడుపురాదు. ఇలాంటి కథలు సినిమాల్లో చూస్తాం. కానీ ఎవరికీ చెప్పుకోలేని విషయం ఇది. నిశ్శబ్దంగా, అజ్ఞాతంగా నా చేతగానితనానికి నేనే ఖైదీనయాను. మనస్సు లోపల్లోపల కుళ్ళిపోతోంది. ఇన్నాళ్ళకి మళ్ళా మరొకరికి ఈ విషయం చెప్పుకునే అవకాశం కలిగింది. ఉండండి ఇప్పుడే వస్తాను'' అని లోపలికి వెళ్ళాడు.

**నాకేదో అనుమానంతోచి** లోపలికి వెళ్ళాను. నేనూహించింది నిజమే వామనరావు ఏడుస్తున్నాడు. సంవత్సరం క్రితం ఏ పాపం ఎరగని, అమాయక వామనరావు ఏడుస్తూ భార్యకు కాఫీని ఫ్లాస్కులో పోస్తున్నాడు.

గుండె తరుక్కుపోయింది నాకు. వసుంధర మీద అసహ్యం, జుగుప్స ముంచుకు వచ్చాయి - ఒక్కసారి ఆమె మీద విరుచుకు పడాలనిపించిది. అతనితో అదే అన్నాను. నవ్వాడు. ''ఆమెదేం తప్పులేదు సార్. మన నిస్సహాయతదే లోపమంతా. ఆమెతో ఇవన్నీ అనకండి. మీతో చెప్పానని తెలిస్తే విసుక్కొంటుంది. ఈ వంట ఉద్యోగంపోతే ఏం చెయ్యాలో తెలీదు'' అన్నాడు.

''అయితే ఎల్లకాలం ఇలాగే బ్రతకాలని మీ ఉద్దేశమా వామనరావుగారూ!'' అని అడిగాను.

అతను తలెత్తాడు. ''నిజం చెప్పమంటారా?''

''ఊఁ''

''మళ్ళా నాకు చదవాలని ఉంది. తీరిక సమయాల్లో పాతపుస్తకాలు చదువుతున్నాను ఈ ఒక్క సంవత్సరం ముగిస్తే చాలా సమస్యలు తీరిపోతాయి''

''మరి ఆమెతో చెప్పలా?''

''నాకు చెప్పడం చేతకాలేదు అందుకే మీకు ఉత్తరం వ్రాశాను. మీరామెతో చెప్పిచూడండి. ఈ సహాయం చెయ్యగలిగితే మిమ్మల్ని మరిచిపోను'' అన్నాడు.

తరువాత వామనరావు లేనప్పుడు వసుంధరతో ఆ విషయం మాట్లాడాను.

''ఆయన ఎలా ఉంటున్నారు?''

ఆమె మొదట ఆశ్చర్యపోయింది.

''అంటే?''

''సంతోషంగానే ఉంటున్నారా?''

''లేదని చెప్పారా మీతో?''

''నేనే అడుగుతున్నాను.''

"నాకు తెలిసినంతవరకూ ఆయనకే లోటూలేదు. తెలిసి నేనేం లోపం చేయడంలేదు. డబ్బు ఎప్పటికప్పుడు వాడుకుంటూనే ఉన్నారు. ఇంకా ఉద్యోగం దొరకలేదు. దానికి నేనేం చెయ్యను?"

వసుంధర ధోరణిలో ఏదో మార్పు కనిపించింది. కూతురు పుట్టిపోయాక బాగా శరీరం పెరిగినట్టనిపించింది. ముఖంలో కండరాలు బాగా పేరుకున్నాయి. ఇదివరకటి దిగులూ, సందిగ్ధం - ఇవన్నీ పోయినట్టున్నాయి.

"ఉద్యోగం చేసి మీకు అండగా ఉండలేకపోతున్నానే అని ఆయన చాలా విచారిస్తున్నాడు" నవ్వింది. అందుకు సమాధానంగా, "తలుచుకుంటే ఇన్నాళ్ళవరకూ దొరికేది కాదంటారా?"

నేను దిమ్మరపోయాను. "అయితే అతను ఇంతకాలం ప్రయత్నించడం లేదంటారా?"

"ఏమో? నాకు నమ్మకంలేదు. అయినా ఆయన్ని ఉద్యోగం చెయ్యమని నేనెప్పుడూ వేధించలేదు. ఈ నెల నా జీతం మరి ఇరవై పెరుగుతోంది. ఇద్దరికీ అది చాలుకదా?"

చివరకు అసలు విషయం కదిపాను.

"మళ్ళీ చదువుకోవాలనుంది వామనరావుగారికి"

ఆమె తెల్లబోయింది "మీతో అన్నారా అలాగని"

ఏం చెప్పాలో తోచక క్షణం తికమకపడి, "లేదు, నేనే కనిపెట్టాను. అయినా చదువుకోడానికి మరో అవకాశం ఇవ్వండి. డిగ్రీ పూర్తయితే ఏ పనయినా తప్పక దొరుకుతుంది" అన్నాను.

ఆమె ఏదో ఆలోచిస్తోంది. సమాధానం చెప్పేవరకు ఎదురుచూస్తూ కూచున్నాను.

"అందుకు నాకేం అభ్యంతరం? ఆయన ఇష్టాఇష్టాన్ని నేనెప్పుడూ కాదనలేదు" అన్నది.

నేను చాలా సంతోషించాను. వసుంధర అనుకున్నంతా మారిపోలేదు, మొత్తం మీద వాళ్ళిద్దరికీ ఆ విధంగా రాజీకుదిరింది. శెలవలు గడిచాక మళ్ళా వామనరావు యూనివర్శిటీలో చేరడానికి నిశ్చయమయింది.

వామనరావు పొంగిపోయాడు. ఇక ఆ రోజంతా తన చదువు ఎంత గొప్పగా సాగుతుందో చెపుతూ నాకేం తోచనివ్వలేదు.

మరి అయిదారు రోజుల తరువాత మద్రాసు తిరిగి వచ్చేశాను. మేం అనుకున్నట్టే వామనరావు యూనివర్శిటీలో చేరాడు.

## 12

అప్పుడప్పుడు వామనరావు దగ్గర్నుంచి ఉత్తరాలు వస్తూండేవి. ఉత్తరాల్ని ఎప్పుడూ నాకు కృతజ్ఞతతో నింపేవాడు. లేదా తన చదువు ఎంత బాగా సాగుతుందో వర్ణించేవాడు. మనిషికి తృప్తి ఇచ్చే మనశ్శాంతి ఇక ఏదీ ఇవ్వలేదనుకుంటాను. ఓసారి గిరిధరరావు కనిపించి ఇప్పుడు వామనరావు చాలా బలంగా తయారయాడన్నాడు. ఆశ్చర్యం ఏమీలేదు మళ్ళీ ఓసారి వామనరావుని కలవాలనిపించేది. కానీ మరి సంవత్సరన్నరవరకు సాధ్యపడలేదు. చదువు పూర్తయి, అక్కడనుంచి ఢిల్లీకి వెళ్ళి ఉద్యోగంలో చేరాను. అటుతరువాత వామనరావు దగ్గర్నుంచీ ఉత్తరాలు నిలిచిపోయాయి. ఎప్పుడో ఒక ఉత్తరం నాలుగు అడ్రసులు మారి నన్ను వెతుక్కుంటూ వచ్చింది. దానిలోనూ విశేషమేమీలేదు.

ఆ తర్వాత ఎప్పుడో ఒకసారి విజయవాడవస్తే ఎవరో అన్నారు.

"మీకు వామనరావు గుర్తున్నాడా?"

తుళ్ళిపడ్డాను, "ఉన్నాడు. ఏం?"

"అతను ఈ ఊరులోనే ఉంటున్నాడు"

"ఈ ఊరులోనా?" అని ఆశ్చర్యపోయాను.

అప్పుడే అతని సమాధానం తెలిసి చాలా నెలలయింది. ఒక్కసారిగా అతని విషయాలమీద ఆసక్తి పెరిగింది. అప్పటి నా పలుకుబడిని ఉపయోగించి పదిమందితో వాకబు చేశాను. నాకు తెలిసిన ఒకరిద్దరు యూనివర్శిటీ మిత్రులతో మాట్లాడాను. చివరకి దొరికాడు.

పాత నగరంలో ఓ మూల ఇల్లు. బజారుపక్కన. ఇదివరకటి ఇల్లుకన్నా పెద్దదే అయినా పాతదికావడంవల్ల ఆ మాత్రం కూడా బాగున్నట్టు తోచడంలేదు.

నేను వెళ్ళిన సమయానికి తలుపు తాళం వేసి ఉంది. ఇద్దరూ బయటికి పోయారని, సాయంకాలం వస్తారని పక్కవాళ్ళెవరో చెప్పారు. వామనరావుకీ ఉద్యోగం దొరికిందనుకుని సంతోషించాను. నా అడ్రసు అక్కడవదిలి వచ్చేశాను.

రాత్రి భోజనం చేసి విశ్రాంతి తీసుకునే సమయంలో ఎవరో హోటలు తలుపు తట్టారు. తీసి చూస్తే ఎవరో భారీ మనిషి చీకటిలో నిలబడ్డాడు.

దీపం వెలుగులో చూస్తే అతనే వామనరావు. ఎంత మారిపోయాడు. దాదాపు ఆరడుగుల మనిషి తెలుస్తున్నాడు. ఇదివరకు నీరసంగా, తూలిపోయేటట్టుండేవాడు. కాస్త బలంగా, నిండుగా పులిలాగా కనిపించాడు. అంత విగ్రహం ఉన్నవాళ్ళు ఏం చేసినా బాగుంటుందనుకుంటాను. ఎటుకదిలినా, ఏ అవయవం కదిలినా అందంగా, హుందాగా కనిపిస్తోంది నాకు. ఒక్కసారిగా నన్ను చూసి కావలించుకున్నాడు. అతని చేతుల్లో పిచ్చుకలాగా ఒదిగిపోయాను.

"వామనరావుగారూ! మీరు చాలా మారిపోయారు" అన్నాను.

మంచి ఖరీదయిన పాంటూ, నుదుటి మీదికి జారేజుత్తూ, ఓ ఉంగరం కూడా అలంకరించాడనుకుంటాను. వాచీ సరేసరి - సిగరెట్లు కాలుస్తాడనుకుంటాను. సరి, ఇంకా ఆ అలవాటు కాలేదు.

ఏదో పెద్ద ఉద్యోగమే చేస్తుండాలి - అనిపించింది.

నన్ను ప్రశ్నల్తో ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాడు. నాకు చాలాసార్లు ఉత్తరాలు వ్రాశాడట, కానీ రెండు మూడు వెనక్కి వచ్చాయట. చాలా ఆశాభంగం చెందాడట. నన్ను ఎలా కలుసుకోవడమో తెలియలేదన్నాడు. గిరిధరరావును కలిసి అడిగితే తనకు తెలియదని చెప్పాడట. చివరికి నా భుజం తట్టి "భలేవారే! - అలా హఠాత్తుగా స్నేహితుల దగ్గర్నుంచి మాయమయిపోతే ఎలాగ! - అయినా మేం గుర్తుంటామా మీకు?" ఇదో కొత్తధోరణి - ఈమధ్య అలవడి ఉంటుందనుకుంటాను.

వామనరావు ఈసారి ఇంకా మారాడు. ఇదివరకు నిర్లక్ష్యంతో కూడిన హాస్యం కనిపించింది. ఇప్పుడు ధీమా, నిబ్బరం, ధైర్యం కనిపిస్తోంది. పరిస్థితులూ, పరిసరాలూ మనిషిని ఎట్లా మారుస్తాయో చెప్పడానికి వామనరావు సాక్షి.

"వామనరావుగారూ! - ఇప్పుడు మీరేం చేస్తున్నారో చెప్పండి" అన్నాను.

నవ్వి "నేనేం చేస్తున్నానో చెప్పేముందు, మా ఆవిడ ఏం చేస్తుందో చెప్పొద్దూ - ఆవిడ ఇప్పుడు స్పెషల్ స్టెనో గ్రాఫర్ - నెలకు 225 రూపాయల జీతం. ఇంకా పిల్లల్లేరు. అందుకని సుఖాన్ని తొందర తొందరగా అనుభవించేస్తున్నాం -" అన్నాడు.

"మరి మీరు?"

"నేను ఊహించినట్టు (లేదా కలలుగన్నట్టు అందాం) బి.ఎస్. సి ఆనర్స్ పాసుకాలేదు. ఆ సంవత్సరం పరీక్షకెళ్ళిన వాళ్ళలో తప్పినవాణ్ణి నేనొకణ్ణే. ప్రొఫెసర్‌తో మరిచిపోలేనంత పెద్ద తగాదా పెట్టి బయటికి వచ్చాను. అన్నట్టు మీకు తెలుసా? - మా నాన్న చచ్చిపోయాడు"

"అయ్యోపాపం" అన్నాను.

"చచ్చిపోవడంలో పాపంలేదు - ఆ వయస్సులో చచ్చిపోవడం కాక ఇంకేం చేస్తాడు? కానీ ఆస్తినంతటినీ తమ్ముడికొక్కడికే రాసిపోయాడు. అదీ గొప్పతనం -" నవ్వుతున్నాడు.

"ప్రస్తుతం మీరేం చేస్తున్నారు?"

"రెండుపూటలా భోజనం చేస్తున్నాను. కొన్నాళ్ళు మీకోసం కూపీ తీసేవాణ్ణి నాకెవరూ ఉద్యోగం ఇవ్వడంలేదండీ" - అన్నాడు.

నేను నిర్ఘాంతపోయాను. ఇంకా వామనరావుకి ఉద్యోగంలేదు. అతన్ని తెల్లబోయి చూస్తూ కూచున్నాను.

నన్ను చూశాక క్రమంగా ఈ కృత్రిమపు హాస్యం, నవ్వు అతని నుంచి జారిపోయింది కాబోలు, ఏదో లోపలి అసంతృప్తిని దాచుకుందుకు పెద్ద రక్షగా తన అంగీని వామనరావు కప్పుకున్నాడు కాబోలు, కుర్చీలో విశాలంగా కూచుని కళ్ళు మూశాడు.

"కష్టాలు, బాధలు, అసంతృప్తులూ అనుకుంటూ విసిగిపోయాను సార్. ఉద్యోగం దొరకలేదు, పరీక్ష పాసుకాలేదు, నాన్న చచ్చిపోయాడు, ఆస్తిలేదు, అమ్మ ఇదివరకే లేదు. ఇక ఇంతకన్నా కష్టాలు, ఇబ్బందులు ఏముంటాయి? ఇన్నీ జరిగాక ఇంక విచారించ కూడదనుకున్నాను. చివరకు వామనరావు ఇలా మిగిలాడు -" ఆగిపోయాడు.

నేను ఇక ఆగలేకపోయాను. ఏవేవో అడగాలనీ, అతనిపట్ల నా పూర్తి అసంతృప్తినీ - ఇంకా చెప్పాలంటే అసహ్యతనీ - అక్కడే ప్రకటించాలనీ అనిపించింది.

"ఇట్లా బ్రతకడం సిగ్గుగా లేదూ మీకు? ఉద్యోగం లేకుండా ఇన్నాళ్ళు ఎలా బ్రతక గలుగుతున్నారు మీరు? వసుంధర ఏమనుకుంటుంది? - ఇంత జరిగాక కూడా మీకు ప్రశాంతత ఉంటుందా?" ఏవేవో అడిగాను.

అన్నిటికీ పెద్ద సమాధానం - అతని నవ్వు.

"వీటన్నిటికీ సమాధానం ఇప్పుడు చెప్పను. రేపు ఉదయమే వచ్చి మిమ్మల్ని మా ఇంటికి తీసుకువెళ్తాను.

మీరు వచ్చారంటే వసుంధర కూడా చాలా సంతోషిస్తుంది. రేపు సిద్ధంగా ఉండండి" అని లేచాడు.

* * *

వసుంధరలో ఏమంత పెద్ద మార్పు కనిపించలేదు. ఇదివరకటి కంటే కాస్త చిక్కిపోయినట్టు, ఏవో ఆలోచనలతో, అసంతృప్తులతో నలిగిపోతున్నట్టు కనిపించింది. అయితే ఆమె ఎప్పుడూ ఎక్కువగా మాట్లాడదు కనుక, ఆ స్థితికి అర్థం వెంటనే తెలియలేదు.

ఒక్కటి మాత్రం నిజం - నన్ను చూశాక ఇదివరకటి కంటే ఆసక్తినీ, సంతోషాన్నీ ప్రకటించింది. నా భార్య గురించీ ప్రశ్నలు వేసింది. కాఫీ తీసుకువచ్చి ఇచ్చింది. ఆశ్చర్యం ఇప్పుడామె స్వయంగా కాఫీ చేస్తుంది.

"వంటకూడానా?" అనడిగాను వామనరావుని ఆమె అటు వెళ్ళాక.

నవ్వుతాడు "ఆహాఁ! అన్నీను. చాలాకాలం క్రిందటే బూట్లుకొన్నాను. వాటిని పాలిష్ కూడా చేస్తుంది" అన్నాడు.

నాకు ఆశ్చర్యం తగ్గడంలేదు. "ప్రతిసారి మిమ్మల్ని కలిసినప్పుడు ఓ వింత కనిపిస్తుంది. ఇంత త్వరగా మీరు ఎలా మారిపోగలుగుతున్నారు?" అనడిగాను.

"ఔషధం చెప్పను. ఫలితాలు చూడండి" అని నవ్వి ఊరుకున్నాడు.

ఆ రెండురోజుల్లో చాలా విషయాలు అర్థమయాయినాకు. ఇంట్లో వామనరావు ఏపనీ ముట్టుకోడు. ఉదయం లేవగానే కాఫీ సిద్ధంగా ఉంటుంది. తరువాత టిఫెన్, వంటకు సిద్ధం చేసి ఉంచి ఆఫీసుకు వెళ్ళిపోతుంది వసుంధర. వీధిలోకి వెళ్ళాలనిపిస్తే వామనరావు వెళ్తాడు; లేకపోతే భోజనం చెయ్యడమే తరువాతి కార్యక్రమం.

రెండోరోజు రాత్రి ఎందుకో తెలివొచ్చింది. ఎవరో గట్టిగా మాట్లాడుతున్నారు. నిద్రమత్తు వదిలాక వామనరావు గొంతు గుర్తుపట్టగలిగాను. వసుంధరని తిడుతున్నాడు, డబ్బుకాబోలు కావాలంటున్నాడు. ఆమె ఏం సమాధానం చెప్పిందో వినిపించలేదు. మరి రెండుసార్లు గద్దించాడు తరువాత కొడుతున్నాడు. ఏదో కర్ర విరిగింది. నిశ్శబ్దంగా ఆమె ఏడుస్తోంది. ఊపిరి బరువుగా తీయడం ఇక్కడికి వినిపిస్తోంది.

దిమ్మరపోయాను నేను. వామనరావు వసుంధరని కొడతాడు. నేను కలలోకూడా ఊహించని విషయం.

ఉదయాన్నే వామనరావు కనిపించలేదు. పెరట్లోకి వస్తే స్తంభానికి చేరబడి ఆమె నిశ్శబ్ధంగా కూచున్నది బహుశా ఏడుస్తున్నట్టుంది, నన్ను చూడగానే తుళ్ళిపడిలేచి కళ్ళనీళ్ళు తుడుచుకుంటోంది.

గుండె చెరువయింది నాకు.

"వసుంధరగారూ! వామనరావుని తెలిసినరోజే మిమ్మల్ని చూశాను. కానీ అతను ఇంతమారిపోతాడని అనుకోలేదు. చివరికి మిమ్మల్ని కొట్టేస్థితికి -"

ఆమె చాలా సిగ్గుపడి, కుంచుకుపోతోందని అర్థమయింది. ఏమీ సమాధానం చెప్పలేక పేలవంగా నవ్వింది.

"ఎన్నాళ్ళనుంచీ ఇలా మారిపోయాడతను?"

ఆమె మాట్లాడలేదు.

"నన్నొకసారి అతనితో మాట్లాడమంటారా?"

ఆమె గాభరాపడింది. "వద్దు, వద్దు, ఆయన్నేం అడక్కండి. నాకేం బాధలేదు, మేమిద్దరం సుఖంగా ఉన్నాం. ఆయనకి ఉద్యోగం దొరికితే ఈ కష్టాలన్నీ తీరిపోతాయి"

"ఎందుకు కొడతాడు మిమ్మల్ని?"

"ఉద్యోగం లేదని"

ఆశ్చర్యమేసింది.

"ఉద్యోగం లేకపోతే మీరేం చేశారు?"

ఆమె నవ్వింది "మీకింకా అర్థంకాలేదా? ఆయనకి ఉద్యోగంలేదు, నాకు ఉంది. అతనేం సంపాదించలేరు, నేను సంపాదిస్తున్నాను. అదీ విషయం."

తల తిరిగిపోయింది నాకు సృష్టిలో ఉన్న ఓ గొప్ప రహస్యాన్ని ఆ ఉదయం బయటపెట్టింది వసుంధర కానీ మగాడి తక్కువతనాన్ని సమర్ధించుకోడానికి ఇంత దరిద్రపు మార్గమా? - వామనరావు మీద అసహ్యత, కోపం కలిగింది - కానీ ఆ పరిస్థితిలో అందరూ అలాగే తయారవుతరేమో! దీనికి ఇంగ్లీషులో ఓ మంచిపేరు పెట్టారు - 'ఇన్ఫీరియారిటీ కాంప్లెక్స్.'

ఆ రోజే నేను ఢిల్లీకి బయలుదేరిపోయాను.

చాలా ఆలోచించి, ఆలోచించి చివరగా వామనరావుతో ఒక్కమాట చెప్పాను. ''వామనరావుగారూ చాలా సంవత్సరాల స్నేహాన్ని పురస్కరించుకు ఓ విషయం చెప్పాలనుకున్నాను, ఏమీ అనుకోరుకదా!''

''ఏంటి?'' అన్నాడు.

''వసుంధరను మీరట్లా కొట్టకూడదు, అది చాలా తప్పు ఎంత తప్పో పాత జీవితాన్ని గుర్తుచేసుకుంటే అర్థమవుతుంది'' అన్నాను.

అతను బిత్తరపోయాడు. ఆక్షణంలో అతని ముఖంలో భావాన్ని చెప్పడం కష్టం.

''వసుంధర చెప్పిందా ఈ విషయం?''

''లేదు, నేనే గుర్తించాను. మిత్రుడిగా ఈ సంగతి చెప్పాను. మళ్ళీ మీరిద్దరూ సుఖంగా ఉండాలంటే ఒకే మార్గం, ఎంత చిన్నదయినా ఓ ఉద్యోగాన్ని వెంటనే చూసుకోండి'' నా ప్రశ్నకు, నా సూచనకు అతను సమాధానం చెప్పేలోగానే రైలు కదిలిపోయింది.

13

తర్వాత రెండేళ్ళు గడిచాక మొన్న మళ్ళీ రైలు స్టేషన్లోనే కనిపించాడు వామనరావు.

అల్లంత దూరం నుంచే గమనించి పెద్దకేకలు పెట్టుకుంటూ పరిగెత్తుకు వచ్చాడు. మనిషిలో మార్పులేదు. కానీ చాలా చలాకీగా ఉన్నాడు. అతని వెనకే వసుంధర, చేతిలో కొడుకూ.

చాలా అర్థమయిపోయింది నాకు.

''రెండేళ్ళ కిందట మీ సలహా పాటించానండీ నా కష్టాలు తీరిపోయాయి. ఇప్పుడు మనకేం ప్రాబ్లమ్‌లేదు'' అన్నాడు హుషారుగా.

వసుంధర నవ్వుతోంది.

''ఏం చేశారు? ఏం చేస్తున్నారు?''

నవ్వాడు. రైలు కిటికీలోంచి లోపలికి తలపెట్టి - ''కలెక్టరాఫీసులో లోయర్ డివిజన్ క్లర్క్ ఉద్యోగం. జీతం 95 రూపాయలు అదీ చేస్తున్న పని అదికాక పిల్లల్ని కంటున్నాను వీడు న్యూ ఇష్యూ. '' కొడుకుని చూపాడు.

చాలా హుషారుగా ఉన్నారు. భార్యాభర్తలిదరూ ఉద్యోగం చేసి సంపాదించుకుంటున్నారు. మొత్తం మీద హాయిగా ఉంటున్నాడనుకున్నాను.

ఈలోగా అతనే అన్నాడు. ''అన్నట్టు చెప్పడం మరిచిపోయాను - వసుంధరను ఉద్యోగం మానిపించేశాను. ఇప్పుడామె ఉద్యోగం వంట వండడం. ఇప్పుడు మా కుటుంబం ఆదాయం 95రూపాయలు'' నవ్వుతున్నాడు.

''నిజమేనా వామనరావుగారూ?'' - అన్నాను నిర్ఘాంతపోతూ.

నిజమేనని తలూపింది వసుంధర నవ్వుతూ.

''మరో న్యూస్ - నేను వసుంధరని కొట్టడం మానేశాను''

ఆశ్చర్యంతో ఉక్కిరిబిక్కిరవుతున్నాను.

''ఏమిటి మీ సంతోషంలో రహస్యం?'' అనడిగాను.

కానీ సమాధానం చెప్పే వ్యవధిలేదు. రైలు కదిలింది. నవ్వుతున్నాడు వామనరావు ''95రూపాయల ఉద్యోగం'' అని ఏదో చెప్పబోతున్నాడు. వసుంధర నమస్కారం చేస్తోంది. రైలు అప్పుడే వాళ్ళని దాటి భవిష్యత్తులోనికి దూకేసింది.

ఆ నిశ్శబ్దంలో వామనరావు జీవితాన్ని ఒక్కసారి పరిచి సత్యాసత్యాన్ని తూకం వేసుకున్నాను. 225 రూపాయలు భార్య సంపాదిస్తున్నప్పుడు వామనరావుకి సుఖంలేదు. కానీ 95రూపాయలు సంపాదించే వామనరావుకు సుఖం ఉంది.

*ప్రతి వ్యక్తికీ భౌతికంగాకాక, మానసికమైన తృప్తి అవసరమేమో.* తన అహాన్ని తృప్తిపరచుకున్నన్నాళ్ళూ వామనరావు నరకం అనుభవించాడు. ఇప్పుడు తన ఆధిక్యతని నిరూపించుకోవడానికి 95రూపాయలు చాలు. ఆమెను తను పోషిస్తున్నాడన్న ఆలోచన మంచికీ చెడుకీ తనే సారధినన్న తృప్తి - భగవాన్ ఎంత విచిత్రమయిన అమరిక ఇది.

సుఖానికి ఇంత చిన్న కీలకమా అనిపించింది.

ఏమైనా వామనరావు సుఖంగా ఉన్నాడు. అందరికీ తృప్తినిచ్చే సుఖాన్ని అనుభవిస్తున్నాడు. అతని సుఖం ఖరీదు 225 రూపాయలుకాదు. 95 రూపాయలే. పరిస్థితుల్ని జీవితం వెక్కిరిస్తోంది. మనస్సు మానవుడిమీద 'కసి' తీర్చుకుంటూంది.

తూర్పున చీకటి చిదికిపోయి వెలుగు నురుగులు బయటికి వస్తున్నాయి.

*(సమాప్తం)*